ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5 బుధవారం 28 ఫిబ్రవరి 2024




# ప్రమాణాలకు.. పాతర!



పట్టాభిపురంలో ఒక పెట్రోలు బంకులో మూలనపడ్డ గాలిపంపు



- పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు
- ఉచిత గాలి, తాగునీరు, ఫస్టెయిడ్ బాక్స్ సహా 6 సేవలు కల్పించాలి
- వాటిని ఏమాత్రం అమలు చేయని బంకు నిర్వాహకులు
- పర్యవేక్షణ, తనిఖీలు కొరవడడంతో నిబంధనలకు తిలోదకాలు
- వినియోగదారుల అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరిపే పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలు కూడా అందడం లేదు. ఇంధనాన్ని విక్రయించడమే కాదని, వినియోగదారులకు పలురకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసినా జిల్లాలో వాటిని పట్టించుకునేవారే లేరు. నిబంధన అమలుకు పూనుకోవాల్సిన అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో వున్న 300కు పైగా పెట్రోలు బంకుల్లో 90 శాతానికి పైగా పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు యధేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.

**టైర్లలో ఉచితంగా గాలి..**

పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. చాలా బంకుల్లో వాటిని సక్రమంగా నిర్వహించడం లేదు. నూటికి 90 చోట్ల అవి పని చేయని స్థితిలోనే వున్నాయి. పనిచేస్తున్నా కొన్ని బంకుల్లో నిర్వాహకులు యంత్రం పని చేయడం లేదని, సిబ్బంది లేరని తప్పించుకుంటున్నారు. శివారు ప్రాంతాల్లోని బంకుల్లోకి లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు వస్తుంటాయి. వాటికి కూడా గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. మరికొంత మంది బలవంతగా డబ్బు వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి టైరుకు రూ.5, కార్లు, ఇతర భారీ వాహనాలకు రూ.10 వసూలు చేస్తున్నారు.



గుంటూరు నగరంపాలెం లోని పెట్రోలు బంకులో పనిచేయని గాలిపంపు

**మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు**

ప్రతీ పెట్రోలు బంకులో మరుగుదొడ్లు అందుబాటు లో ఉంచాలి. చాలామంది బంకుల నిర్వాహకులు వాటిని నిర్వహించడం లేదు. చాలాచోట్ల మూత్రశాలల బోర్డులు పెట్టి సరిపుచ్చారు. ఒక వేళ మరుగుదొడ్లు వున్నా వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే పడివుంటున్నాయి. చాలాబంకుల్లో అవి సిబ్బంది కోసమే అన్నట్లు ఇతరులకు అనుమతించడం లేదు.

**అవగాహనాలేమి.. అధికారుల బాధ్యత**

పెట్రోల్‌బంకుల్లో విధిగా కల్పించాల్సిన సౌకర్యాలపై వినియోగదారులకు ఎవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాలు వినియోగదారులకు తెలిపేలా ప్రభుత్వంగానీ, సంబంధిత అధికారులుగానీ కనీస చర్యలు తీసుకోకపోవడంతో వినియోగదారులు తమకు హక్కుగా రావాల్సిన సౌకర్యాలను అన్నింటినీ కోల్పోతున్నారు. లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌కు వినియోగదారుడు పెట్రోల్ బంకుల వారికి 4 నుంచి 6 పైసలు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం పన్ను రూపంలో చెల్లిస్తున్నాడు. సగటున ఒక పెట్రోల్ బంకులో రోజుకు 10వేల లీటర్ల చమురు అమ్మితే టాయిలెట్స్ నిర్వహణ వ్యయం కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ.500 కంటే ఎక్కువే వుంటుంది. ఆ డబ్బుతో టాయిలెట్, మంచినీరు ఇతర సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత పెట్రోల్ బంకులదే.

**తాగునీరు ఉండదు..**

పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతి కూడా ఉండాలి. కానీ చాలా బంకుల్లో ఈ సౌకర్యం కల్పించడం లేదు. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగునీటి అవసరం ఎక్కువగా వుంటుంది. వాస్తవానికి బంకు నిర్వాహకుడు ఆర్వో యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. దాంతోపాటు ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదుల పెట్టె, లేదా రిజిస్టర్ వినియోగదారులకు అందుబాటులో వుంచాలి. పలు పెట్రోల్ బంకుల్లో కల్తీపెట్రోల్ అమ్ముతున్నారన్న ఫిర్యాదులు తరుచూ వినపడుతున్నా ఫిర్యాదుల పెట్టె లేకపోవడంతో వినియోగదారులు ఆ సౌకర్యాన్ని వాడుకోలేకపోతున్నారు. దీంతోపాటు ఇంధన నాణ్యతను పరిశీలించుకునే సదుపాయాన్ని కూడా బంకులోనే అందుబాటులో వుంచాలి. వాటిని కూడా పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడంలేదు. వీటితోపాటు రోడ్డు ప్రమాదానికి గురైనవారికి అందుబాటులో ఉండేలా ప్రతి పెట్రోలు బంకులో ఒక ప్రథమ చికిత్స బాక్సు, ఒక టెలీఫోన్ వుంచాలి. కానీ ఇవేవీ పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడం లేదు.




హిందూ కాలేజీ సెంటర్లో మంచి నీటి సదుపాయం పరిస్థితి ఇది..

**పర్యవేక్షణ, తనిఖీలేవి?**

పెట్రోల్ బంకుల్లో సేవలపై సంబంధిత అధికారులు పెద్దగా పట్టించు కోవడం లేదు. తనిఖీలు కూడా చేయడం లేదు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవచ్చు. నిబంధనలు బేఖాతరు చేసేవారిపై జరిమానా విధించవచ్చు. బంకుల ను మూసివేయవచ్చు. కానీ గడిచిన ఐదేళ్లలో అలాంటి దాఖాలు మచ్చుకు కూడా లేవు.

# మృతులకూ.. ఓట్లు



చెరుకుపల్లి : తూర్పుపాలెంలో ఓటర్ల జాబితాలో తొలగించని మృతిచెందిన వారి ఓట్లు

- తప్పుల తడకగా ఓటర్ల జాబితా
- ఫిర్యాదు చేసినా తొలగించని మృతుల ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు
- నియోజకవర్గంలో 307 డబుల్ ఎంట్రీ ఓట్లు

రేపల్లె, ఫిబ్రవరి 27: ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకగా మారింది. పారదర్శక ఓట్ల జాబితాను రూపొందించాలని ఎన్ని ఫిర్యాదులు అందినా పట్టించుకునే నాథుడే లేడు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం పంచాయతీలో 221, 222, 223 బూత్‌నెంబర్‌ల్లో పదుల సంఖ్యల్లో మృతుల ఓట్లు ఉన్నాయని, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు కలిగి ఉన్నారని ఫిర్యాదు చేసినా నేటికి తొలగించిన దాఖలాలు లేవు. ఓటర్ల జాబితాను ఆయా బూత్‌లను స్థానిక టీడీపీ నాయకులు పరిశీలించటంతో ఈ విషయం బయట పడింది. ఒకే ఓటర్లకు రెండు ఓట్ల చొప్పున పదిపైగానే ఉన్నాయి. మరణించిన వారి ఓట్లను తొలగించిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలో 307 ఓట్లు డబ్లింగ్ ఉన్నాయని, జీరో డోర్ నెంబరుతో 38ఓట్లు ఉన్నాయి. నేటికి వాటిని తొలగించిన దాఖలాలులేవు.

**తప్పుల తడకలో ఓట్లు...**

తూర్పుపాలెం పంచాయతీలో మృతిచెందిన వారికిఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో గుర్తించి ఫిర్యాదు చేసినా తుదిజాబితాలో తొలగించిన దాఖలాలు లేవు. ఓటర్ల లిస్టులను పరిశీలిస్తుంటే తవ్వే కొద్ది డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి ఓట్లు బయట పడుతున్నాయి. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం పంచాయతీలోని మత్తి నాగేశ్వరరావు (బూత్ నెం.222లో సీరియల్ నెం.91), పూషడపు సూర్యకాంతం (బూత్ నెం.223 సీరియల్ 37), పానుగంటి ఆంజనేయులు (బూత్ నెం.223, సీరియల్ నెం.212), పాలపర్తి పోలయ్య (బూత్ నెం.223, సీరియల్ నెం.523), బడే నాంచారమ్మ (బూత్ నెం.223, సీరియల్ నెం.569), ఆవుల పిచ్చియ్య (బూత్‌నెం.221లో సీరియల్ నెం.12), పూషడపు నాగమల్లేశ్వరరావు(బూత్‌నెం.221, సీరియల్ నెం. 100), చందు లక్ష్మీకుమారి (బూత్ నెం.221, సీరియల్ 408), చందనం నాగరత్నం (బూత్ నెం.221, సీరియల్ నెం.522), పూషడపు వెంకాయమ్మ (బూత్ నెం.221లో సీరియల్ నెం.606), పూషడపు సుబ్బారావు (బూత్ నెం.221, సీరియల్ నెం.799), మత్తి బ్రహ్మయ్య (221లో సీరియల్ నెం.797), మత్తి సీతామహాలక్ష్మి (బూత్ నెం.221, సీరియల్ నెం.825)... వీరంతా మృతి చెందారు. కానీ ఓటర్ల జాబితాలో నుంచి వీరి ఓట్లు తొలగించాలని కోరినా తొలగించిన దాఖలాలు లేవు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఈ విధంగా ఓట్లు ఉన్నాయి. తూర్పుపాలెంలో పూషడపు రఘురామ్ (223వ బూత్‌లో సీరియల్ నెం.45), 221వ బూత్‌లో 217సీరియల్ నెం.లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. అదే విధంగా బడే శివపార్వతి (223వ బూత్, సీరియల్ నెం.266), అదే బూత్‌లో సీరియల్ నెం.673లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. ఆళ్ళ సామ్రాజ్యం (223వ బూత్‌లో సీరియల్ నెం.89), 221వ బూత్‌లో 565 ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. మత్తి చిరంజీవి (బూత్‌నెం.222లో సీరియల్ నెం.168లో), అదే బూత్‌లో 628 సీరియల్ నెంబర్‌లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. బీఎల్‌వోలు నిర్లక్ష్యం కారణంగానే ఓటర్ల జాబితా అంతా తప్పుడు తడకగా మారింది. ఉన్నతాధికారులు దృష్టిసారించి ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి ఓట్లను తీసేసి ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న వారిని కూడా తొలగించాలని కోరారు.

## వైసీపీ సభలా.. జాబ్‌మేళా

- అధికారుల కంటే.. పార్టీ నేతలే అధికం
- 950 మందికి 187 మంది మాత్రమే ఎంపిక

అద్దంకి, ఫిబ్రవరి 27: జాబ్‌మేళా కార్యక్రమం. నిరుద్యోగులు, పరిశ్రమల ప్రతినిధులు, ఇంటర్వ్యూలు నిర్వహించేవారితో హడావుడిగా ఉండాలి. కానీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళా వైసీపీ సభను తలపించింది. జాబ్‌మేళాకు ముఖ్యఅతిథిలుగా హాజరైన వారిలో అధికారుల కంటే వైసీపీ నాయకులే ఎక్కువగా ఉన్నారు. వీరిని



వైసీపీ రంగులతో ఉన్న వేదిక

చూసి నిరుద్యోగులు ఆశ్చర్యపోయారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉందని పెద్దఎత్తున ప్రచారం చేశారు. అయితే జాబ్‌మేళాకు పెద్ద కంపెనీలు హాజరుకాలేదు. పైగా 950 మందిని ఇంటర్వ్యూ చేసి 187 మందిని మాత్రమే ఎంపిక చేశారు. వారిలో మళ్లీ 92 మందిని చివరి రౌండ్ కోసం ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. దీనిపై యువకులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, మెప్మా సీపీఎం ఫణికుమారి, హారిక, శ్రీనివాస్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ మాకినేని శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ దేసు పద్మేష్, కొల్లా భువనేశ్వరి, బాజీవలి తదితరులు పాల్గొన్నారు.




జాబ్ మేళాకు హాజరైన యువత

## ఆర్డినరీ చార్జీలు అమల్లోకి..

- ఎన్నికల వేళ రైళ్ల చార్జీల పునరుద్ధరణ
- గుంటూరు - విజయవాడ రూ.10కే టిక్కెట్
- రేపల్లెకు రూ.20, మాచర్ల టిక్కెట్ రూ.30 మాత్రమే

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సాధారణ రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తాయిలం ప్రకటించింది. కోవిడ్ తర్వాత పాసింజర్ రైళ్లను స్పెషల్ ట్రైన్లుగా నడుపుతూ మెయిల్/ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తూ వచ్చిన రైల్వే శాఖ పాత ఆర్డినరీ చార్జీలను పునరుద్ధరించింది. అయితే దక్షిణ మధ్య రైల్వే జోన్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు స్పెషల్ చార్జీలనే వసూలు చేశారు. ఆర్డినరీ చార్జీ ఆప్షన్‌ను యూటీఎస్ యాప్‌లో మంగళవారం నుంచి అందుబాటులోకి తీసు కొచ్చారు. ఈ నేపథ్యంలో చార్జీలను బుధ/గురు వారాల నుంచి అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రయాణికుల క్రమబద్ధీకరణ పేరుతో ఆర్డినరీ పాసింజర్ రైళ్లను ప్రత్యేక పాసింజర్లుగా రైల్వే శాఖ పట్టా లెక్కించింది. వాటిలో కనీస టిక్కెట్ ధర రూ.30గా నిర్ణయించి ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తున్నది. గుంటూరు నుంచి నల్లపాడు/పెదకాకాని /వేజండ్లకు వెళ్లాలన్నా రూ.30 చెల్లించాల్సి వచ్చేది. గుంటూరు నుంచి విజయవాడ, సత్తెన పల్లి, తెనాలికి రూ.30 వసూలు చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కనీస చార్జీ రూ.10(పాత చార్జీ)ని పున రుద్ధరించారు. రేపల్లెకు ప్రస్తుతం రూ.35 ఉన్న చార్జీ రూ.20కి తగ్గనుంది. నరసరావుపేటకు రూ.30 ఉన్న టిక్కెట్ రూ.15కి దిగి వస్తుంది. అలానే పిడుగురాళ్లకు రూ.45 ఉండగా ఇది రూ.20కి తగ్గుతుంది. నడికుడికి రూ.50 నుంచి రూ.25కి, మాచర్లకు రూ.60 నుంచి రూ.30కి తగ్గుతుంది. వినుకొండకు రూ.45 నుంచి రూ.25కు తగ్గుతుంది.




**సర్క్యులర్ రాగానే అమలు**

రైల్వేబోర్డు సర్క్యులర్‌ని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ విభాగం నుంచి తమకు అందగానే పాసింజర్ రైళ్లలో ఆర్డినరీ చార్జీల అమలుని ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి. మంగళవారం రైల్వేబోర్డు నుంచి సర్క్యులర్ జారీ అయినట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందని, అయితే ఆ ఉత్తర్వులు తమకు అధికారికంగా అందాల్సి ఉందని పేర్కొన్నాయి. అప్పటి వరకు స్పెషల్ పాసింజర్ చార్జీలే అమలులో ఉంటాయని స్పష్టం చేశాయి. కాగా ఎన్నికలకు నెల ముందు ఇలా పేదలకు గాలం వేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చార్జీలను తగ్గించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

## నెలలోపే.. బదిలీ

- నాలుగు మున్సిపాలిటీలకు కొత్త కమిషనర్లు
- ఎన్నికల బదిలీల్లో ఇటీవలే వారి నియామకం
- ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టితోనే తాజా బదిలీలా?



బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సన్నద్ధత లో భాగంగా ఈసీ ఆదేశాలను అనుసరించి ప్రభుత్వం ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లను బదిలీ చేసింది. వారు బాధ్యతలు కూడా స్వీకరించారు. అయితే వారు సీట్లో కూర్చొని నెల కూడా దాటకుండానే ప్రభుత్వం మళ్లీ మార్చింది. ఫిబ్రవరి మొదటి వారంలో చేపట్టిన బదిలీల్లో చీరాల కమిషనర్ రామచంద్రారెడ్డిని బాపట్లకు, రేపల్లె కమిషనర్ విజయసారథిని చీరాలకు నియమించారు. రేపల్లెకు రాంభూపాల్‌రెడ్డి, అద్దంకికి రషీద్‌ను కమిషనర్లుగా నియమించింది. అయితే మంగళవారం మున్సిపల్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ నాలుగు మున్సిపాలిటీలకు కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా రేపల్లెకు శేషాద్రి, బాపట్లకు శ్రీకాంత్, చీరాలకు సింహాచలం, అద్దంకికి సత్యనారాయణను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్వర్వులు వెలువడ్డాయి. ఒకటి రెండు చోట్ల కాకుండా జిల్లాలో ఉన్న మొత్తం నాలుగు మున్సిపాలిటీల్లో కమిషనర్ల మార్పు ఒకేసారి జరగడం చర్చకు దారి తీసింది. అందునా ఈ బదిలీలు జరిగి నెల కూడా గడవక ముందే మళ్లీ కొత్త ముఖాలను నియమిస్తూ మున్సిపల్ విభాగం ఉత్తర్వులివ్వడం వెనక ఈసీ కన్నెర్ర చేయడమే కారణమనే ప్రచారం ఉంది. ఫిబ్రవరి మొదటి వారంలో చేపట్టిన బదిలీల్లో చాలావరకు రాజకీయ నేతల అండదండలతోనే జరిగాయిని ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసింది. దీంతో ఈసీ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. లోక్‌సభ పరిధిలో విధులు, లేదంటే ఉమ్మడి జిల్లా ప్రామాణికంగానే ప్రస్తుతం మార్పు జరిగిందనే వాదన ఉంది. అయితే ఈసీ ఆదేశాలతోనే మళ్లీ మార్పు నిర్ణయాలు జరుగుతున్నాయనేది సమాచారం. ఒక్క మున్సి పాలిటీ విభాగం లోనే కాకుండా గతంలో జరిగిన బదిలీల్లో చాలా మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రోజుకు మిగిలేది.. రూ. 10 లక్షలే!

- సింహ భాగం ఖర్చులకే పోతోంది
- ఇసుక దందాలో అక్రమార్కుల వాదన
- అధికారులు పొంతనలేని సమాధానాలు

చీరాల, ఫిబ్రవరి 27: 'వివిధ రూపాల్లో సింహభాగం ఖర్చవుతుంది. ఇందులో మా స్థాయిలో చెల్లించాల్సిన చెల్లింపులు ఉంటాయి. అవి పోతే ఇక రోజుకు మాకంటూ మిగిలేది రూ.10 లక్షలే. మాకు ఇంకా ఎన్ని ఖర్చులు ఉంటాయో మీకు తెలీదు..' అని ఇసుక దందాలో వచ్చే ఆదాయంపై అక్రమార్కుల సమర్థన ఇది. మొత్తమ్మీద ఇసుక దందాను సమర్థించుకునేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తుండగా వారికి అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలంలో చినగంజాం, కడవకుదురు మధ్య ఆర్‌వోబీ సమీపంలో రైల్వే ట్రాక్‌కు తూర్పువైపున, మరికొన్ని చోట్ల ఇసుక దందా అందరికీ కనిపిస్తుంది. కానీ సంబంధిత అధికారులు మాత్రం దీనిని ఆపేందుకు కనీస ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఆంధ్రజ్యోతిలో ఇసుక దందా శీర్షికన కథనం ప్రచురితమైన మంగళవారం కూడా నాలుగు ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు, ట్రాక్టర్లు ఇసుక నింపుతూనే ఉన్నారంటే వారి బరితెగింపు ఏమిటో అర్థమవుతుంది.



టిప్పర్లకు ఇసుక నింపుతున్న ఎక్స్‌కవేటర్లు

**ఎటువంటి అనుమతులు లేకుండానే..**


సాధారణంగా ఇసుక అక్రమార్కులు ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రభుత్వ గృహ నిర్మాణాలకు సంబంధించి ఇసుక తవ్వకాలకు రెవెన్యూ శాఖ పరంగా ప్రత్యేక అనుమతులు తీసుకుని ఇసుక దందా సాగిస్తుంటారు. కానీ ప్రస్తుతం అక్రమ తవ్వకాలు సాగిస్తున్న వారికి అలాంటి అనుమతులు కూడా లేవని సమాచారం. ఒకవేళ వారికి అనుమతులు ఉన్నాయనుకున్నా వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి భారీ గోతుల ఏర్పడేలా తవ్వకాలు సాగిస్తున్నా అధికారులకు పట్టకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ తవ్వకాలు చట్టవిరుద్ధమైనా. దీనికి సంబంధించి అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్తున్నారు. జగనన్న కాలనీలకు ఇసుక సరఫరా చేసేందుకు వారికి అనుమతులు ఉన్నాయని చినగంజాం ఎస్‌ఐ శ్రీనివాసరావు చెప్పారు. అయితే నిర్దేశిత సర్వే నెంబర్లలోనే తవ్వకాలు సాగుతున్నాయా అని అడగ్గా వాటికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో సమాచారం తీసుకోవాలని చెప్పారు. చినగంజాం, కడవకుదురు మధ్య ఆర్‌వోబీ సమీపంలో కానీ, ఇతర ప్రాంతాల్లో కాని ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు ఫణీంద్రబాబు చెప్పారు. ఆర్‌వోబీ సమీపంలో జరుగుతున్న అనధికారిక తవ్వకాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. నూతనంగా వచ్చాను.. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై చర్యలు తప్పవు.. పరిశీలించి చర్యలు చేపడతామని చీరాల ఎస్‌ఈబీ సీఐ కర్ణ తెలిపారు. ఇసుక దందాపై మైనింగ్ అధికారులను వివరణ అడిగేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా వారు స్పందించలేదు. ఇలా ఎవరికి వారు ఇసుక అక్రమాలపై తప్పించుకునే ధోరణిలో సమాధానాలు చెప్పడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# మిస్సింగ్ నంబర్ టెస్ట్

## ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

### పార్ట్-2

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 63 బి) 58 సి) 73 డి) 52 సమాధానం: (సి)

**వివరణ:** మొదటి డయాగ్రామ్‌లో

8 x 4 = 32 6 x 8 = 48 32 + 48 = 80

రెండో డయాగ్రామ్‌లో

7 x 8 = 56 6 x 4 = 24 56 + 24 = 80

అదేవిధంగా మూడో డయాగ్రామ్‌లో

9 x 5 = 45 7 x 4 = 28

45 + 28 = 73 సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 45 బి) 62 సి) 56 డి) 72 సమాధానం: (ఎ)

**వివరణ:** ప్రతి డయాగ్రామ్‌లో కింది రెండు అంకెల లబ్దం పైన గల సంఖ్య

6 x 7 = 42 9 x 8 = 72అదేవిధంగా

5 x 9 = 45 సమాధానం అవుతుంది.

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

| | | |
|---|---|---|
| P32 | R17 | Q7 |
| Q26 | P38 | R8 |
| R12 | Q24 | ? |

ఎ) $P_8$ బి) $P_6$ సి) $Q_8$ డి) $R_7$ సమాధానం: (బి)

**వివరణ:** ఇచ్చిన డయాగ్రామ్‌లో ప్రతి వరుసలోను P, Q, Rలు నిలువుగా, అడ్డంగా ఏదో ఒక స్థానంలో ఉంటున్నాయి.

ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో ఉండాల్సిన అక్షరం P. ప్రతి అడ్డు వరుసలో మొదటి రెండు సంఖ్యలను కూడితే ఏర్పడే సంఖ్య, మూడో స్థానంలో గల సంఖ్యకు వర్గం.

32 + 17 = 49 అనేది $7^2$

26 + 38 = 64 అనేది $8^2$ అదేవిధంగా

12 + 24 = 36 అనేది $6^2$. కాబట్టి సమాధానం $P_6$ అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 15 బి) 72 సి) 54 డి) 32

సమాధానం: (సి)

**వివరణ:** మొదటి డయాగ్రామ్‌లో 8 x 7 = 56.

రెండో డయాగ్రామ్‌లో 3 x 5 = 15

కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 9 x 6 = 54 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

# దిక్సూచి DIKSUCHI

# హైదరాబాద్ ఐఐఐటీలో లేటరల్ ఎంట్రీ, పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌లు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఎల్ఈఈఈ) 2024, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. లేటరల్ బీటెక్-ఎంఎస్; ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి వీటిని ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్స్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.



### లేటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎల్ఈఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(బీటెక్-ఎంఎస్)లో లేటరల్ ఎంట్రీకి అవకాశం కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొదట బీటెక్ డిగ్రీని ఆ తరవాత రీసెర్చ్ థీసిస్ పూర్తిచేసి ఎంఎస్ డిగ్రీని పొందవచ్చు.

**స్పెషలైజేషన్‌లు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీడీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌డీ)

**అర్హత:** ఈసీడీ విభాగానికి బీఈ/బీటెక్(ఈసీఈ/ఈటీఈ/ఈఐఈ/ ఈఈఈ/ఐఓటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్); సీఎస్‌డీ విభాగానికి బీఈ/బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఏఐ అండ్ ఎంఎల్/డేటా సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్) చదువుతున్న అభ్యర్థులు అర్హులు. 2024 జూలై నాటికి నాలుగో సెమిస్టర్ పూర్తిచేసి ఉండాలి. కొవిడ్-19 వల్ల అకడమిక్ ఇయర్‌లో వచ్చిన మార్పుల కారణంగా దరఖాస్తు నాటికి మూడో సెమిస్టర్ పూర్తిచేసినవారిని అనుమతిస్తున్నారు. కనీసం 80 శాతం మార్కులు తప్పనిసరి.

**ఎల్ఈఈఈ 2024 వివరాలు:** ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే పరీక్షలో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సర్క్యూట్ థియరీ అండ్ నెట్‌వర్క్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, బేసిక్ అల్గారిథమ్స్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్, డిస్క్రీట్ మేథమెటిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.

### పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ)

ఈ ఎగ్జామ్ ద్వారా ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంటెక్, ఎంఎస్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి అయిదేళ్లు. వీటిలో కోర్సు వర్క్ ప్రధానంగా ఉంటుంది. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో అదనంగా రీసెర్చ్ థీసిస్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

**ఎంటెక్ స్పెషలైజేషన్‌లు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్

**ఎంఎస్(రీసెర్చ్) స్పెషలైజేషన్‌లు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్

**పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, స్పేషియల్ ఇన్ఫర్మాటిక్స్, కాగ్నిటివ్ సైన్స్, హ్యూమన్ సైన్సెస్.

**అర్హత:** ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/సైన్స్) ఉత్తీర్ణులు లేదా మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. పీహెచ్‌డీలో కాగ్నిటివ్ సైన్స్ స్పెషలైజేషన్‌కు కాగ్నిటివ్ సైన్స్/సైకాలజీ/లింగ్విస్టిక్స్/ఫిలాసఫీ/సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు, ఎంబీబీఎస్/ఎండీ ఉత్తీర్ణులు అర్హులు. హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు హ్యూమానిటీస్/సోషల్ సైన్సెస్ విభాగాల్లో ఎంఏ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు అయిదేళ్ల అనుభవం ఉన్నవారు; ఎమ్మెస్సీ/ఎంఎస్/ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు రీసెర్చ్ థీసిస్ సబ్మిట్ చేసిన వారు అర్హులు. కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్‌కు ఎమ్మెస్సీ(ఫండమెంటల్ సైన్సెస్) లేదా సీఎస్/ఐటీ/బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోమెడ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఏ (మేథ్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**పీజీఈఈ 2024 వివరాలు:** దీనిని కూడా సీబీటీ మోడ్‌లోనే నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో బేసిక్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కంప్యూటర్స్, మేథమెటిక్స్ అంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. రెండోది సబ్జెక్ట్ పేపర్. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. అభ్యర్థి డిగ్రీ స్థాయిలో చదివిన విభాగాన్ని అనుసరించి సబ్జెక్ట్ పేపర్ ఎంచుకోవాలి. రెండు పేపర్లకూ నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావుమార్కు కోత విధిస్తారు. పేపర్‌కు గంటన్నర చొప్పున మొత్తం పరీక్ష సమయం మూడు గంటలు. ఎంటెక్‌లో ప్రవేశానికి రెండు పేపర్లూ రాయాలి. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు సబ్జెక్ట్ పేపర్ ఉండదు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీహెచ్‌డీలో హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరు రీసెర్చ్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **ఎల్ఈఈఈ పీజీఈఈ తేదీ:** మే 4న
- **ఇంటర్వ్యూలు:** లేటరల్ ఎంట్రీకి మే 25న; ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌నకు జూన్ 5, 6; పీహెచ్‌డీకి జూన్ 7, 8
- **వెబ్‌సైట్:** iiit.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wBs0JgQలో చదవండి.

# SCHOLARSHIP ALERT

## K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad

***Description:*** K.C. Mahindra Scholarships for Post-Graduate Studies Abroad 2024 is an opportunity offered by the K. C. Mahindra Education Trust, a public charitable trust, for graduate students who are willing to pursue postgraduate studies abroad in various fields.

***Eligibility:*** Open for Indian citizens who have a first-class degree or equivalent diploma of similar standard from recognised universities. Applicants must have secured admission or have applied for admission in reputable foreign universities for courses commencing from August 2024 but not later than February 2025.

***Prizes & Rewards:*** Interest-free loan scholarship of up to 10,00,000

***Last Date:*** 31-03-2024 ***Application mode:*** Online only

***Short Url:*** www.b4s.in/aj/KCMQ1

## ICRO Amrit Internship Programme

***Description:*** ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

***Eligibility:*** Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

***Prizes & Rewards:*** A monthly stipend of 6,000 and a certificate of completion.

***Last Date to Apply:*** Round the year

***Application:*** Online Only ***Short Url:*** www.b4s.in/aj/ICRA1

## India Fellow Social Leadership Program

***Description:*** India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18- month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.

***Eligibility:*** Open for Indian citizens aged between 20 to 30 years.

Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any the matic area.

***Prizes & Rewards:*** A monthly stipend of up to 22,000 and other benefits

***Last Date to Apply:*** 15-08-2024

***Application mode:*** Online Only

***Short Url:*** www.b4s.in/aj/IFSA2

buddy4study.com


# నవ్య | చిత్రజ్యోతి



## క్రేజీ కాంబినేషన్

జైలర్ చిత్రం ఇచ్చిన సక్సెస్‌తో రజనీకాంత్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన దర్శకుడు టీజే జ్ఞానవేల్ రాజా, లోకేశ్ కనగరాజ్‌తో సినిమాలు చేస్తున్నారు. తాజాగా రజనీకాంత్ హీరోగా మరో చిత్రం ఖాయమైంది. పలు కమర్షియల్ హిట్లు ఇచ్చిన బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్ వాలా కొత్త చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రజనీకాంత్‌ను కలసిన ఫొటోను షేర్ చేసి, 'లెజెండరీతో కలసి పనిచేసే అవకాశం నాకు దక్కిన గౌరవం. త్వరలోనే మా మరపురాని ప్రయాణం ప్రారంభిస్తాం' అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించే అవకాశముంది.

## వీరమల్లు విజృంభణ ఖాయం



పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. పవన్ కల్యాణ్ రాజకీయాలపై దృష్టి పెట్టడమా? లేక మరేదైనా కారణమో తెలియదు కానీ కొన్ని షెడ్యూల్స్ పూర్తయ్యాక తాత్కాలికంగా చిత్రీకరణ నిలిచిపోయింది. అయితే పవన్ కల్యాణ్ ఈ సినిమాను దాదాపుగా పక్కనపెట్టినట్లేనని కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో మేకర్స్ ఈ ప్రచారాన్ని ఖండించారు. 'హరిహర వీరమల్లు' చిత్రం ఆగిపోలేదని చెబుతూ ఈ మధ్యనే కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించారు. అయితే క్రిష్ అనుష్కతో హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా తీస్తున్నాడంటూ ప్రచారం మొదలైంది. దీంతో 'హరిహర వీరమల్లు'ను పక్కనపెట్టడం వల్లే ఆయన కొత్త ప్రాజెక్ట్‌ను ఓకే చేశారనే టాక్ నడుస్తోంది. దీంతో ఈ ఊహాగానాలకు తెరదించేందుకు నిర్మాత ఏఎం రత్నం రంగంలోకి దిగారు. చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'హరిహర వీరమల్లు' సినిమా ఆగిపోలేదు. దీనికి కొనసాగింపు చిత్రం కూడా ఉంటుంది. పవన్ కల్యాణ్‌ను హీరోగా మరో స్థాయికి తీసుకెళ్లే చిత్రమిది' అని తెలిపారు. 'డబ్బు కోసమే అయితే పవన్ కల్యాణ్‌తో ఏదో ఒక సినిమా చేసి సంపాదించుకోవచ్చు. కానీ మేం అలా అనుకోవడం లేదు. 'హరిహర వీరమల్లు' సినిమాతో ఆయనకు పేరు రావాలి, మాకు ఎప్పటికీ గుర్తుండిపోవాలనేదే మా కోరిక' అన్నారు. 'హరిహర వీరమల్లు చిత్రం ఆగిపోయిందంటూ కొంత మంది చేస్తున్న ప్రచారం నిజం కాదు. అవన్నీ అసత్యాలే. వాటిని నమ్మకండి' అని పవన్ అభిమానులను కోరారు. అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్ఎక్స్ పనులు చేయాల్సి రావడం వల్ల మేకింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందని గతంలో ఏఎం రత్నం చెప్పారు.

## ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు

**వరుణ్‌తేజ్ నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ మూవీ 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. శక్తి ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. విడుదల సందర్భంగా మంగళవారం వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.**



- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ 2020లో ఈ కథతో నన్ను సంప్రదించారు. కథ నాకు బాగా నచ్చింది. సోనీ పిక్చర్స్ సంస్థకే నేను ఓ సినిమా చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అది టేకాఫ్ కాలేదు. నేషనల్ అప్పీల్ ఉన్న కంటెంట్ కావడంతో ఇది వారికి కూడా నచ్చింది. చాలా గ్రాండ్ బడ్జెట్‌తో పక్కాగా ప్లాన్ చేసి సినిమా తీశారు. దర్శకుడు ఉత్తరాదివాడే అయినా తెలుగులో చేయాలనే కోరిక ఉంది. అందుకే తెలుగు, హిందీ వెర్షన్స్‌లో తీశాం. ఒక భాషలో తీసిన వెంటనే మరో భాషలో చిత్రీకరించారు.
- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ ఈ ప్రాజెక్ట్ కోసం చాలా రీసెర్చ్ చేశారు. సినిమా అంటే అతనికి ఫ్యాషన్. అయినా ఏదో ఒక సినిమా చేయాలని అనుకోకుండా నా ద్వారా ఈ చిత్రకథను చెప్పాలని అనుకున్నాడు. ఇంతకుముందు అతను చేసిన షార్ట్ ఫిల్మ్ బాగా వైరల్ అయింది. ఎయిర్ ఫోర్స్ అధికారులు కూడా అది చూసి ఆశ్చర్యపోయారు. దాన్నే సినిమా చేయాలనుకుంటే కావాల్సిన సహకారాన్ని అందిస్తామని వారు చెప్పారు. దర్శకుడికి వీఎఫ్ఎక్స్ పై మంచి పట్టు ఉండడంతో విజువల్‌గా కూడా చాలా బాగా వచ్చిందీ చిత్రం
- పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్ర దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఆపరేషన్ నిర్వహించింది. వాలెంటైన్ డే నాడు జరిగింది కనుక అలా టైటిల్ పెట్టాం. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- తొలిసారిగా హిందీలో నటిస్తున్నాను కనుక హిందీ నేర్చుకోవడం కోసం రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. నా భార్య లావణ్య కూడా ఈ విషయంలో హెల్ప్ చేసింది. ఒక సీన్ మొదట హిందీలో షూట్ చేసి, తర్వాత తెలుగులో తీసేవాళ్లు. అప్పుడు మధ్య మధ్యలో హిందీ డైలాగులు కూడా వచ్చేసేవి.
- ఈ సినిమా టీజర్ రిలీజ్ అయ్యాక బాబాయ్‌ను కలిశాను. ఆయన సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. కానీ ఈ సినిమా టీజర్‌ని ఐదారు సార్లు చూసి 'చాలా బాగుంది. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా చక్కగా ఉన్నావు. ఈ సినిమా చూడాలని ఉంది' అని అనడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.






## న్యూ ఏజ్ ఫిల్మ్ లవ్ మీ

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రానికి 'లవ్ మీ' అనే టైటిల్ నిర్ణయించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై అరుణ్ భీమవరపు దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. టైటిల్ ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ ' ఇదొక న్యూ ఏజ్ ఫిల్మ్. 'ఆర్య' కథ విని ఎలా ఎగ్జయిట్ అయ్యానో ఈ చిత్ర కథ విని అదే అనుభూతి పొందాను. ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణం నాగ మల్లిడి. అతను నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఓ స్క్రిప్ట్ వినండి.. ఫ్రెండ్‌తో కలసి తయారు చేశానని నాగ చెబితే కథ విన్నాను. నాకు నచ్చడంతో చాలా మందికి చెప్పాను. అందరూ ఎగ్జైట్ అయ్యారు. ఇలా స్క్రిప్ట్ దశలో ఎగ్జైట్ అవడం అరుదుగా జరుగుతుంటుంది. హీరోగా ఆశిష్ కావాలని అడిగారు. అలాగే హర్షిత్, హన్షితలను ఇవ్వమని నాగ అడిగాడు. స్క్రిప్ట్ పూర్తయాక టెక్నిషియన్ల పేరు చెబితే భయం వేసింది. అయినా ఛాయాగ్రాహకుడు పీసీ శ్రీరామ్‌నీ, కీరవాణిగారిని కలసి కథ చెప్పి ఒప్పించారు. ఫిబ్రవరి 27న టైటిల్ అనౌన్స్ చేశాం. ఏప్రిల్ 27న సినిమా విడుదల చేయబోతున్నాం.'ఆర్య' విషయంలో నాకు జరిగిందే ఈ టీమ్‌కు జరగబోతోందనే వైబ్స్ వస్తున్నాయి' అన్నారు. చిత్ర కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ 'ఈ మూవీ నాకు ప్రత్యేకం. ఇలాంటి స్టోరీ లైన్ ఎక్కడా చూడలేదు. త్వరలో టీజర్ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా చూశాక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌తో ప్రేక్షకులు బయటకు వస్తారు' అని చెప్పారు.

## భవానీ వార్డ్‌లో ఏం జరిగింది?



గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ముఖ్య పాత్రలు పోషించిన హారర్ థ్రిల్లర్ 'భవానీ వార్డ్' ఫస్ట్ లుక్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు జీడీ నరసింహ మాట్లాడుతూ 'నేను చెప్పిన కథ నచ్చి ఇందులో నటించడమే కాకుండా పూర్తి సహకారం అందించిన గాయత్రిగారికి ధన్యవాదాలు. నిర్మాత ప్రోత్సాహంతో, నటీనటుల సహకారంతో అందరికీ నచ్చేలా ఈ సినిమా తీశాను. భవానీ వార్డ్‌లో జరిగే సంఘటనలు ఉత్కంఠభరితంగా ఉంటాయి. హారర్ చిత్రాలను ఇష్టపడే వారికే కాకుండా అందరినీ అలరిస్తుంది' అన్నారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలనే ఈ సినిమా తీసినట్టు నిర్మాతల్లో ఒకరైన కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. టెక్నికల్‌గా సినిమా చాలా బాగుంటుందని గాయత్రి గుప్తా చెప్పారు. హీరోగా తనకు అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు గణేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సినిమాలో ఒక మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉందని జర్నలిస్టు సాయి సతీశ్ చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tvoqe3p లో చదవండి.


వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

# అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని

**● 1533వ రోజుకు రైతుల ఆందోళనలు**

తుళ్లూరు, ఫిబ్రవరి 27: మూడు ముక్కలాట ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడానికే తప్ప అభివృద్ధి కోసం కాదని, అభివృద్ధి కోసమే అయితే అమరావతి రాజధాని పనులను సీఎం జగన్‌రెడ్డి విస్మరించారని 33వేల ఎకరాలు రాజధాని అమరావతి కోసం ఇచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని నాశనం చేయవద్దంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1533వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, కులాలు మతాలు, వర్గాలు అంటూ సీఎం జగన్‌రెడ్డి విడదీసి పాలిస్తున్నాడని ఆరోపించారు. బ్రిటీషర్లు అవలబిస్తున్న విభజించు పాలించు అనే విధానంతో ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు కోట్ల మంది ఐక్యతతో అమరావతిని కోరుకోవడంతో విభజన సిద్ధాంతం ఫలించలేదన్నారు. సిద్ధం సిద్ధం అంటూ గోల చేస్తున్న పాలకులు దేనికి సిద్ధం అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపద అమరావతిని నాశనం చేసినందుకా.. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయలేక పోయినందుకా.. ప్రజావేదికను కూల గొట్టినందుకా.. సంక్షేమ పథకాలు మాటున దోచుకున్నందుకా.. పరిశ్రమలు రాకుండా చేసినందుకా.. దేనికోసం సిద్ధ అని ప్రశ్నించారు. మిమ్మల్ని ఇంటికి పంపటానికి సిద్ధంగా ప్రజలున్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

## మార్చి 11వ తేదీ వరకు పలు రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టీఎఫ్‌టీఆర్ పని కారణంగా మార్చి నెల 11వ తేదీ వరకు పలు రైళ్లని రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు - నంబూరు - మంగళగిరి సెక్షన్‌లలో ఈ పనులు జరగనున్నాయి. ఈ కారణంగా నెంబరు. 07783 విజయవాడ - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07779 గుంటూరు - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, 07628 విజయవాడ - గుంటూరు, 07464 విజయవాడ - గుంటూరు, 07465 గుంటూరు - విజయవాడ, 07786 గుంటూరు - రేపల్లె, 07783 రేపల్లె - తెనాలి, 07630 తెనాలి - విజయవాడ రైళ్లను మార్చి 11వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. అలానే నెంబరు. 17282 నరసపూర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ విజయవాడ వరకే ప్రయాణించి ఆగిపోతుందన్నారు. నెంబరు.17281 గుంటూరు - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ మార్చి 11వ తేదీ వరకు గుంటూరుకు బదులు విజయవాడ నుంచి నరసపూర్‌కు బయలుదేరి వెళుతుందన్నారు. ఈ మార్పులు గమనించి ప్రయాణికులు సహకరించాలని డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.





# పట్టాభిషేకం

● జీఎంసీలో ఘనంగా 73వ గ్రాడ్యుయేషన్ సెర్మనీ
● మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోండి
● డీఎంఈ డాక్టర్ రఘునందన్ ఉద్బోధ

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 27: వైద్య కళాశాల నుంచి ఎంబీబీఎస్ పట్టాతో సమాజంలోకి అడుగు పెడుతున్న మీరు... తెలివైన వైద్యులుగా కాదు... మనసున్న మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోండి.. అంటూ రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు (అకడమిక్) డాక్టర్ జి.రఘునందన్ ఉద్బోధించారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగిన 73వ గ్రాడ్యుయేషన్ సెర్మనీ 'ఆక్సాన్ 24'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జింకానా ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో 2018 సంవత్సరం బ్యాచ్ వైద్య విద్యార్థులకు ఎంబీబీఎస్ పట్టాలను ప్రదానం చేశారు. తొలుత వైద్య విద్యార్థులతో మూకుమ్మడిగా హిపోక్రాటిక్ ప్రమాణం చేయించారు. గ్రాడ్యుయేషన్ సెర్మనీకి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులూ హాజరుకావడంతో ఉదయం నుంచే కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. డీఎంఈ డాక్టర్ రఘునందన్ ప్రసంగిస్తూ రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని ఆయన కోరారు. గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్, ఎన్నారై డాక్టర్ పొదిల ప్రసాద్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు కేవలం ఎంబీబీఎస్‌తోనే తమ విద్యను ముగించకుండా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేయాలని సూచించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ చందా భాస్కరరావు, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం డిగ్రీ పట్టా అందుకున్న యువ వైద్యులు గ్రూప్ ఫోటోలతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగారు.


ప్రసంగిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్


రఘునందన్ నుంచి డాక్టర్ పట్టాను అందుకుంటున్న విద్యార్థిని

# మాచర్లలో వైసీపీ అరాచకాలపై లేఖ

**● సీఈవోకు లేఖ రాసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు**

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల అసెంబ్లీలో అధికారపార్టీ అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు లేఖ రాశారు. పోలింగ్ బూత్‌ల ఆక్రమణకు గురయ్యే మండలాలు, గ్రామాలను లేఖలో ప్రస్తావించారు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న ఎన్నికల సంఘం గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2009, 2014, 2019లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ డేటాను విశ్లేషించాలని కోరారు. 2021లో జరిగిన స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల్లో వైసీపీ గూండాలు ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనీయలేదన్నారు. మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల్లో నమోదైన నామినేషన్ల వివరాలు సీఈవోకి నివేదించారు. మాచర్లలో అధికారపార్టీ గూండాలు హత్యలు, దొమ్మి, దోపిడీలు, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకటరామిరెడ్డిలు చెప్పినట్లు అధికారులు, పోలీసులు ఆడుతున్నారు. మాచర్లలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. రాబోయే సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# వలంటీర్లతో ఇంటింటికీ కుక్కర్లు

**● పంపిణీ చేయిస్తున్న వైసీపీ**



వలంటీర్లు పంపిణీ చేసిన కుక్కర్

అమరావతి, ఫిబ్రవరి 27: దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలన్న చందాన ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఎన్నికల తాయిలాలను ఓటర్లకు పంపిణీ చేయాలనే లక్ష్యంతో వైసీపీ నాయకులు వలంటీర్లతో ఇంటింటికీ కుక్కర్లు పంపిణీ చేస్తున్నారు. వలంటీరు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి స్థానిక ఎమ్మెల్యే ఫొటో, ఎన్నికల గుర్తు ఉన్న స్టిక్కర్‌ను అంటించిన కుక్కర్‌ను అందజేస్తూ వారి ఆధార్ నెంబరు నోట్ చేసుకుంటున్నారు. ఇదేం పద్ధతి అని పలువురు చర్చించుకుంటున్నారు.

# తాగునీటి సరఫరాలోనూ వివక్ష

● టీడీపీ వర్గీయుల ప్రాంతానికి నిలిపివేత
● తాగునీరు ఇవ్వకుంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేయాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ ఆంజనేయులు, జనసేన పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలందరికీ తాగునీరు అందించాల్సి ఉండగా అధికార పార్టీ నాయకులు కొందరు వివక్షత చూపుతూ టీడీపీ వర్గీయులు నివాసం ఉండే బజార్లకు నీటి సరఫరా ఇవ్వబోమంటూ ట్యాంకర్లను నిలిపి వేయటం దుర్మార్గం అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వేసి బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన తాగు నీరు సరఫరాకు టీడీపీ హయాంలో రూ.640 కోట్లు నిధులను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇంటింటికి కుళాయి వేస్తానని, వరికపుడిసెల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి శాశ్వతంగా తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరిస్తానని, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేక పోతే తాను మీకు ముఖం చూపించనని చెప్పి ప్రజలను మోసం చేశాడన్నారు. గత ఏడాది వినుకొండలో జరిగిన సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బొల్లాపల్లి చెరువుకు మూగచింతలపాలెం డీప్ కట్ నుంచి పైపులైన్ వేయించి సాగర్ జలాలతో నింపి సమస్య పరిష్కారానికి రూ.12 కోట్లు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చి నెరవేర్చకుండా మండల ప్రజలను మోసం చేశాడన్నారు. తాగు నీరు లేక బొల్లాపల్లి మండలంలోని ప్రజలు వలసలు పోయే పరిస్థితి నెలకుందన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కమిషన్లకు కక్కుర్తిపడి వాటర్ గ్రిడ్ పథకాన్ని అడ్డుకున్నారన్నారు. తాగునీటి సరఫరాలో అధికార పార్టీ వివక్షతను వీడాలని, అటువంటి వ్యక్తులపై అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని తాగు నీరు ఇంటింటికీ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీ కుండలను పగల గొట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జరపాల గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమా నాయక్, కోటా నాయక్, వెంకటేశ్వరరెడ్డి, మన్నెయ్య, రంగయ్య, నారాయణ, బాబూరావు, వెలగాల బాదరయ్య, అజీజ్, గోవిందరాజులు, శ్రీనివాసరావు, షేక్ ఖాశిం, పోకా వెంకటరావు, మంగా బాయి, రాపర్ల జగ్గారావు, బత్తుల గోవిందరాజులు, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో టీడీపీ, జనసేన ధర్నా

# వైద్యాధికారి వేధింపులపై ఫిర్యాదు

**● చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు వినతి**


వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రదర్శన నిర్వహిస్తున్న ఆరోగ్యసిబ్బంది

బాపట్ల ఫిబ్రవరి 27: చీరాల డివిజన్ వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న వైద్యాధికారి డాక్టర్ బాలరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైద్యసిబ్బంది మంగళవారం ఆందోళన చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు శేషుబాబు మాట్లాడుతూ వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కె.బాలరాజు ఏడాది నుంచి సిబ్బందిని మానసిక వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై అనేకసార్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు తెలియజేయటం జరిగిందన్నారు. మహిళా ఉద్యోగులను తన మాటలు, చేష్టలతో అసభ్యకర పదజాలంతో వేధింపులకు గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశంజిల్లా ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు కేపీదాసు, ఎన్.రవి, గుర్వమ్మ, సీహెచ్‌వో మార్తమ్మ, హెచ్‌బీ మాధురి, పిచ్చయ్య జీవీఎన్.ప్రసాద్, ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,56,917 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,40,541 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 1,19,436 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | సూపర్ 10 | 13000 | 16700 |
| 334 | 1000020400 | | నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| నెంబరు. 5 | 10500 | 19000 | తేజ | 9000 | 21000 |
| 273 | 12500 | 19500 | బ్యాడిగి | 10000 | 20000 |
| 341 | 9000 | 20000 | దేవనూరుడీలక్స్ | 9500 | 20000 |
| 4884 | 13700 | 18000 | తెల్లకాయలు | 5000 | 12500 |

# ముస్లిం మైనార్టీలపై వైసీపీ నేత దౌర్జన్యం

**● వడ్డిముక్కలలో పర్యటించిన టీడీపీ, జనసేన నిజనిర్ధారణ కమిటీ**

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి27: వడ్డిముక్కల గ్రామంలో ముస్లిం మైనార్టీలపై స్థానిక వైసీపీ నాయకుడే దౌర్జన్యాలు చేశాడని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహ్మద్ మోసిన్ అన్నారు. మంగళవారం వడ్డిముక్కల గ్రామంలో టీడీపీ నిజనిర్ధార్ణ కమిటీ, జనసేన నాయకులు పర్యటించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి మోసిన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ గని, జనసేన నాయకులు ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మోసిన్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన వైసీపీ నాయకుడు చింతగుంట నాగభూషణరావు అతని కుమారుడు ముస్లిం మైనార్టీలపై దౌర్జన్యాన్నికి దిగాడని ఆరోపించారు. నడక దారి వ్యవహారంలో ఈ ఘటన జరిగిందన్నారు. దారి మూసివేతపై స్థానిక ముస్లింలు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్ని ఆరోపించారు. ఈ విషయమై రూరల్ ఎస్ఐకి గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కూడా చర్యలు చేపట్టలేదన్నారు. ఈ అంశాన్ని టీడీపీ నాయకత్వం, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మండల అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, షేక్ బాజీ సాహెబ్, సిల్లార్ బాషా, జానీ బేగ్, జాషా, ఇస్మాయిల్, హజరత్ అలీ, కరిముల్లా బాజీ, పఠాన్ ఫైజుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


వడ్డిముక్కల గ్రామంలో స్థానిక ముస్లింలతో మాట్లాడుతున్న నాయకులు

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 27: విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని మద్దినగర్‌లో మంగళవారం జరిగింది. షేక్ అబూబాకర్(11) అనే బాలుడు మంచినీటి కోసం అతని గృహంలోని విద్యుత్ మోటారును స్విచ్ ఆన్ చేయబోయి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా ఆ కుటుంబానికి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లెల రాజేష్ నాయుడు కుటుంబానికి మరో రూ.10వేలు సాయం అందజేశారు.

## లభ్యం కాని రెండు మృతదేహాల ఆచూకీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 27: పట్టణంలో ఇటీవల రెండు వేర్వేరు సందర్భాల్లో మృతి చెందిన ఇద్దరు వృద్ధుల ఆచూకీ తెలపాలని పట్టణ పోలీసులు మంగళవారం కోరారు. నరసరావుపేట రోడ్డులో పోలిరెడ్డిపాలెం వద్ద 65 సంవత్సరాల వయస్సు గల ఒక వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉండగా అతడిని చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించటం జరిగిందని తెలిపారు. ఐతే అతడి ఆచూకీ తెలియ రాలేదన్నారు. వేరొక ఘటనలో స్థానిక కళామందిర్ సెంటర్‌లో దడబడ అంజయ్య(68) అనారోగ్యంతో చని పోగా అతడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతదేహాన్ని తీసుకోవటానికి ఎవ్వరూ రాలేదని పేర్కొన్నారు. ఈ ఇద్దరి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌కు తెలియ జేయాలని కోరారు.

# సమన్వయంతో ముందడుగు

● పిడుగురాళ్లలో ప్రముఖులతో యరపతినేని భేటీ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 27: గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం రాత్రి పిడుగురాళ్లలోని ప్రముఖులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యరపతినేనిని ఆ నేతలు కూడా ఆప్యాయంగా ఆహ్వానించడంతో పాటు కుశల ప్రశ్నలతో పలకరించారు. రేపటి ఎన్నికలలో టీడీపీ, జనసేన గెలుపునకు మనమందరం ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉందామని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేద్దామని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జానపాడుకు చెందిన ప్రముఖ నేత వున్నం నరసింహారావును కోరారు. మీ గౌరవాన్ని పెంచే విధంగా అన్నింటా ప్రాధాన్యం కల్పిస్తామని యరపతినేని శ్రీనివాసరావు, వున్నం నరసింహారావుతో చెప్పారు. పిడుగురాళ్లలో మంగళవారం రాత్రి యరపతి నేని, నరసింహారావుతో పాటు ఆయన తనయుడు, ప్రముఖ వైద్యులు వున్నం నాగ మల్లికార్జునరావును కలిశారు. ఈ భేటీలో పలు అంశాలకు నరసింహారావు, డాక్టర్ నాగమల్లికార్జునరావులు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే అభ్యర్థిగా యరపతినే నిని, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలును, పార్టీని బలపరచడం మనంద రి ధ్యేయం, చంద్రబాబును ముఖ్యమంత్రిగా, రాష్ట్రంలో టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు మనవంతు కృషి చేద్దామని చర్చకు వచ్చినట్లు తెలిసింది.


వున్నం నరసింహారావు, డాక్టర్ నాగమల్లికార్జునరావుతో చర్చిస్తున్న యరపతినేని తదితరులు

# ఖరీదైన వాహనాలే టార్గెట్

● ఆంధ్రా నుంచి వచ్చి తెలంగాణలో చోరీలు..
● అరెస్ట్ చేసిన పోలీసులు
● నాలుగు బుల్లెట్ బైక్‌లు, ఒక హీరో బైక్ స్వాధీనం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో ఖరీదైన వాహనాలను దొంగిలిస్తున్న ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన జి.రామాంజనేయులు(21), గోగుల గోపాలకృష్ణ(20), షేక్ కసినపల్లి బాషా(24)లు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను దొంగిలించేవారు. గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్ గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను, నవంబర్‌లో అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో మరోబైక్‌ను దొంగిలించి గుంటూరుకు తరలించారు. ఈనెలలో సూర్యాపేట టూ టౌన్ పీఎస్ పరిధిలో రెండు బైక్‌లను, హైదరాబాద్ సుల్తాన్‌బజార్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్(ఎంజీబీఎస్) పార్కింగ్‌లో పార్క్ చేశారు. మూడు రోజుల క్రితం గుంటూరు నుంచి మిగతా రెండు బైక్‌లను విక్రయించేందుకు నగరానికి తీసుకువచ్చి ఎంజీబీఎస్‌లో పార్క్ చేశారు. వీటిని అమ్మేందుకు రెండు బుల్లెట్ బైక్‌లపై ముగ్గురు నిందితులు మంగళవారం కాచిగూడ ఎక్స్‌రోడ్ మీదుగా కింగ్ కోఠికి వెళ్తుండగా అక్కడే తనిఖీలు చేస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని ఆపారు. వారి కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని రెండు బుల్లెట్ బైక్‌ల నెంబర్లను పరిశీలించి దొంగిలించిన వాహనాలుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రా నుంచి బస్సులో వచ్చి దొంగిలించిన వాహనాలను కింగ్ కోఠిలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలింది. దీంతో ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.


నిందితులు, వారు దొంగిలించిన వాహనాలతో పోలీసులు

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 155, 164,175 |
| చికెన్ విత్ స్కిన్ | 300.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 310.00 |

## డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో భాగంగా డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం మంగళవారం బదిలీ చేసింది. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ రవీంద్రరావుని నందిగామ ఆర్‌డీవోగా, గంగరాజు మరిననిని కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్లగా పోస్టింగ్ చేసింది. కేఆర్ఆర్‌సీ పల్నాడు ఎస్‌డీసీటీ అజయ్‌కుమార్‌ని గుంటూరు పౌరసరఫరాల విజిలెన్స్ విభాగం ఎస్‌డీసీగా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

**చిలకలూరిపేట పురపాలక సంఘం**

ఆర్.ఓ.సి.నెం. 564/2020/ఏ2 తేది. 26.02.2024

**బహిరంగ వేలం నోటీసు**

చిలకలూరిపేట పురపాలక సంఘమునకు చెందిన డాక్టర్ వై.యస్.ఆర్. మునిసిపల్ కూరగాయల మార్కెట్, చేపలు & మాంసం మార్కెట్ మరియు సంత్రి మార్కెట్ నందు 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను అనగా తేది. 01.04.2024 నుండి 31.03.2025 వరకు పల్నాడు జిల్లా అసాధారణ రాజపత్రం 19 తేది 05.02.2024లోని షరతుల మేరకు గుత్తలను వసూలు చేసుకొను హక్కులను లీజుకు ఇచ్చుటకుగాను ది. 11.03.2024 అనగా సోమవారం ఉదయం 11.00 గంటలకు చిలకలూరిపేట పురపాలక సంఘ కౌన్సిల్ హాలు నందు మునిసిపల్ కమీషనర్ వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

గమనిక :- ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనర్,
చిలకలూరిపేట పురపాలక సంఘం.

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

## ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

బాపట్ల,ఫిబ్రవరి 27 : ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేసేందుకు వ్యక్తిగత శ్రద్ధతో పని చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రభుత్వ ప్రాధాన్య అంశాలైన కన్వేనియన్స్‌డీడ్స్, రిజిస్ట్రేషన్స్, హౌసింగ్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, గ్రామసచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌సెంటర్‌ల నిర్మాణం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. సమవేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కన్వేనియన్స్ డీడ్స్‌ను వెంటనే ప్రజలకు అందించాలన్నారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను మండలస్థాయి అధికారులు, ఇతర అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తి చేయుటకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయమై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీకార్డులను పంపిణీ చేసేందుకు ఎంపీడీవోలు ప్రణాళికబద్ధంగా, రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకొని తదనుగుణంగా పూర్తి చేయుటకు కృషి చేయాలన్నారు. గృహనిర్మాణానికి సంబంధించి వివిధ దశలలో ఉన్న నిర్మాణాలను తర్వాత దశకు తీసుకెళ్ళేందుకు సంబంధితాధికారులు కృషి చేయాలన్నారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయుటకు నిర్లక్ష్యం వహించే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై క్రమశిక్షణా చర్యలకు వెనకాడేది లేదన్నారు. అదేవిధంగా ఇప్పటికే నిర్మాణాలు పూర్తిఅయిన గ్రామసచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, హెల్త్‌క్లినిక్స్ సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రారంభించటానికి తగుచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఈ హరిరామకృష్ణ, డీఎంఅండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలియోరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 27 : పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లాలోని పుట్టినబిడ్డ దగ్గర నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలియో ఎప్పటికి పిల్లల దరికి చేరకుండా పూర్తి రక్షణగా తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 27 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని కత్తివారిపాలెం గ్రామానికి చెందిన 40 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పెద హరిజనవాడ గ్రామానికి చెందిన 30 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, చందోలు గ్రామానికి చెందిన ముస్లీం మైనార్టీ నాయకులు 70 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, చటర్జీ, టీడీపీ మండల మాజీ అధ్యక్షురాలు గోకరాజు శ్రీధర్ వర్మ, మాజీ సర్పంచ్‌లు మంతెన శ్రీదేవి కృష్ణమూర్తిరాజు, వేగేశన జ్యోతి రామకృష్ణంరాజు ఆయా మండల, గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న బాపట్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, పార్టీనాయకులు

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని

బాపట్ల, ఫిబ్రవరి 27 : రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమం కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపేయన్ కార్యక్రమాన్ని 10వ వార్డు 94, 95 పోలింగ్‌బూత్‌ల పరిధిలో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ పోటీ చేస్తున్నారు ప్రతి ఒక్కరు ఆయనకు అండగా ఉండి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలన్నా, రాజధాని నిర్మించాలన్నా, యువతకు భవిష్యత్తు కావాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు కూచిపూడి ఝాన్సీరాణి, వేమవరపు సుజాత, దగ్గుమల్లి రాణి, వేమవరపు విజయ్‌కుమార్, పల్లంజీవన్ పాల్గొన్నారు.


మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

## ఫార్మసీ కళాశాలలో ముగిసిన ప్రతిబోత్సవ్

● విజేతలకు బహుమతులు ప్రదానం

బాపట్ల, ఫిబ్రవరి 27 : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు ముఖ్యఅతిధులుగా పాల్గొని విజేతలను అభినందించారు. ప్రతిబోత్సవ్ 2024కు హాజరైన క్రీడాకారులను అభినందించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ విన్నర్స్‌గా నరసరావుపేట ఇండోఅమెరికన్ స్కూల్ ఆఫ్‌ఫార్మసీ, రన్నర్స్‌గా బాపట్ల ఫార్మసీ కళాశాల జట్లు నిలిచాయి. కబడ్డీలో బాపట్ల ఫార్మసీ కళాశాల జట్టు విజేత కాగా చేబ్రోలు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటి సైన్సెస్ రన్నర్స్‌గా నిలిచారు. త్రోబాల్‌లో బాపట్ల ఫార్మసీ కళాశాల విజేత కాగా చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటి సైన్సెస్ రన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో బాపట్ల ఫార్మసీ కళాశాల విజేత కాగా నరసరావుపేట ఎంఎఎం కాలేజి ఆఫ్ ఫార్మసీ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. షాట్‌పుట్ బాలుర విభాగంలో విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, బాపట్ల ఫార్మసీ కళాశాల, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ వారు మొదటి మూడు స్థానాలలో నిలిచారు. షాట్‌పుట్ బాలికల విభాగంలో బాపట్ల ఫార్మసీ కళాశాల మొదటి రెండుస్థానాలు గెలుచుకోగా చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఫార్మసిటికల్ సైన్సెస్ తృతీయ స్థానంలో నిలిచింది. క్యారమ్స్‌లో విజ్ఞాన్ కాలేజి విజేత కాగా గుంటూరు హిందుకాలేజి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ విజేత కాగా బాపట్ల ఫార్మసీ కళాశాల రన్నర్స్‌గా నిలిచింది. చెస్ బాలుర విభాగంలో పెద్దాపురం సెయింట్ మేరీస్ కాలేజి విజేత కాగా చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ విజేత కాగా బాపట్ల ఫార్మసీ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. బహుమతులు ప్రదానం చేసిన వారిలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు గెల్లి దిలీప్‌కుమా ర్, కోశాధికారి టి.రామకృష్ణ, బి.సుధీర్‌చౌదరి, ప్రిన్సిపాల్ టి.గోపాలకృష్ణమూర్తి ఉన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న బాపట్లఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు

## పేదల సంక్షేమానికి శ్రమించే పార్టీ తెలుగుదేశం

● నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నరేంద్రవర్మ


మహిళలకు, చీరసంచి, మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, పార్టీ నాయకులు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 27 : బడుగు, బలహీన వర్గాలతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే పార్టీ తెలుగుదేశం పార్టీయేనని బాపట్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామ పంచాయతీలోని రెడ్లపాలెం గ్రామంలో మంగళవారం మీమాట-నాబాట కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలతో కలిసి ఆయన నిర్వహించారు. వేగేశన నరేంద్రవర్మ టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికెళ్ళి ఇరుపార్టీల మేనిఫెస్టో గురించి గ్రామస్థులకు, మహిళలకు వివరించారు. అసెంబ్లీ ఎన్నికలలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈసందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మహిళలకు చీర, సంచి, ఉమ్మడి పార్టీల మేనిఫెస్టో కరపత్రం, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పెనుమెత్స రవివర్మ, అల్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నిజాంపట్నం నాగరాజు, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు కృష్ణ, టంగు సుబ్బారెడ్డి, భూపతిరెడ్డి, అక్కల చెన్నారెడ్డి, అక్కల చంద్రశేఖరరెడ్డి, అక్కల శివగోపిరెడ్డి, పిట్టు శంకరరెడ్డి, కుర్రా శ్రీధర్, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ, మేకా సుబ్బారెడ్డి, మండల గ్రామ టీడీపీనాయకులు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### హైదర్‌పేట, సత్యవతిపేటలో నరేంద్రవర్మకు ఘనస్వాగతం

కర్లపాలెం, ఫిబ్రవరి 27 : రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హైదర్‌పేట, సత్యవతిపేట గ్రామస్థులను బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మను అభ్యర్థించారు. నరేంద్రవర్మ ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట కార్యక్రమానికి జనసేన, టీడీపీ నాయకులతో కలిసి సత్యవతిపేట, హైదర్‌పేటలకు మంగళవారం రాత్రి చేరుకోగానే గ్రామస్థులు పెద్దఎత్తున పూలజల్లులతో, హారతులతో నరేంద్రవర్మకు ఘన స్వాగతం పలికారు. నరేంద్రవర్మ ఇంటింటికి తిరిగి మహిళలకు ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరించి చీరలు, తను గురించి తెలియజేసేబుక్‌లెట్‌ను ప్రజలకు అందజేశారు. నరేంద్రవర్మను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాతా జయప్రకాష్ నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : పోలీసురావు

కర్లపాలెం, ఫిబ్రవరి 27 : రానున్న వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. కర్లపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో గోసాని సాంబయ్య గృహం దగ్ధమవ్వగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు ఆదేశాల మేరకు తాత్కాలిక గుడారానికి పట్టా, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గంపల వెంకటరెడ్డి, ఏకశిర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధపోరాటయోధుడు ఆజాద్ చిరస్మరణీయులు

బాపట్ల, ఫిబ్రవరి 27 : బ్రిటీష్ వారి గుండెల్లో నిద్రించి వారికి సింహస్వప్నంగా మారిన చంద్రశేఖర్ ఆజాద్ భారతస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి సాయుధ పోరాట యోధుడని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు పేర్కొన్నారు. ఆజాద్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ లాలాలజపతిరాయ్ మృతికి కారణమైన ఆంగ్లేయ అధికారులపై ప్రతీకారం తీర్చుకొని భారతీయుల సత్తా చాటారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జమ్శుద్‌బాషా, వై.భాస్కర్‌గౌడ్, టి.భాస్కరరావు, నర్రా సాంబు తదితరులు పాల్గొన్నారు.

## పటేల్‌నగర్‌లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

బాపట్ల, ఫిబ్రవరి 27 : పట్టణంలోని పటేల్ నగర్ మొదటి లైన్‌లో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ వారు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాపట్ల, కర్లపాలెం, కారంచేడు మండలాల పరిధిలోని ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మంగళవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ ప్రారంభించి బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్ స్కీమ్స్, పెన్షన్ స్కీమ్‌లు, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంకింగ్ సేవలు గురించి ప్రజలలోకి తీసుకెళ్ళాలని చెప్పారు. సంస్థ సీఈవో ఎం.రమణయ్య, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఇమ్రాన్ మహ్మద్, కెనడా బ్యాంక్ మేనేజర్ జితేంద్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రవీంద్ర, సంస్థ కోఆర్డినేటర్లు రాజశేఖర్, పొన్నూరు, రేపల్లె, అమర్తలూరు, పర్చూరు కేంద్రాలకు సంబంధించిన కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. అనంతరం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్యసిబ్బందికి వినతి

బాపట్ల, ఫిబ్రవరి 27 : వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మకు వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. శాఖా పరమైన సమస్యలను సత్వరమే స్పందించి ప్రభుత్వానికి తెలియజేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యంరాజు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బడుగు శివాజీ, ఎడ్ల శ్రీనివాసరావు, శ్యామల ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బొజ్జ శ్రీకాంత్


బొజ్జ శ్రీకాంత్

బాపట్ల, ఫిబ్రవరి 27 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బొజ్జ శ్రీకాంత్‌ను నియమించారు. ఇటీవల చీరాల పురపాలక సంఘం నుంచి బాపట్ల బదిలీపై వచ్చిన కె.రామచంద్రారెడ్డిని ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కోవూరు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌ను బాపట్లకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా నియమించిన ఎ.భానుప్రతాప్‌ను డైరెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

## సహాయ పౌరసంబంధాల అధికారిగా రవీంద్రబాబు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్రబాబు

బాపట్ల, ఫిబ్రవరి 27 : సహాయ పౌరసంబంధాల అధికారిగా ఏపీఎస్ రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టి కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఏడీ సుభాషిణి పాల్గొన్నారు.

## విద్యార్థులకు రక్తదానంపై అవగాహన

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 27 : మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం విద్యార్థులకు ఎయిడ్స్, రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఎయిడ్స్, రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ చింతల కిషోర్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులలో పోటీతత్వం ఎంతో అవసరం

● యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేష్‌బాబు

బాపట్ల టౌన్, ఫిబ్రవరి 27 : విద్యార్థులలో పోటీతత్వం ఎంతో అవసరమని యూనియన్ బ్యాంక్ బాపట్ల మేనేజర్ ఎన్.సురేష్‌బాబు అన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లీష్ భాష, కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధిస్తే ఉన్నత ఉద్యోగాలను పొందవచ్చునన్నారు. వ్యాసరచన పోటీలలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఈ పోటీలలో గెలుపొందిన వారికి నగదుతోపాటు మెమొంటో, సర్టిఫికెట్‌ను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎండీసాధిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 27 : మండలంలోని వెల్లటూరులో శ్రీ కోదండరామస్వామి దేవాలయ పునఃప్రారంభం విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. అయిదు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం గోపూజ, దేవతా హోమాలు, నారాయణ హోమం, పంచసూక్త హోమాలు, మంత్రపుష్పం, సాయంత్రం హోమాలు, క్షీరాధివాసం, మంత్రపుష్పం నిర్వహించారు. భజన బృందాలు శ్రీరామనామ కీర్తనలు ఆలపించాయి. ఈనెల 29న ఉదయం శ్రీ కోదండరామస్వామి పరివార దేవతల విగ్రహాల ప్రతిష్ఠ, కళావాహన, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకాలు అనంతరం ధ్రువ కల్యాణం జరుగుతుందని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మశ్రీ జానపాటి లీలావేణుగోపాలశర్మ శిష్య బృందం పర్యవేక్షణలో ఉత్సవాలు జరగనున్నాయి.

## నిరాహార దీక్షలను విజయవంతం చేయాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 27 : కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జరిగే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కె.రామస్వామి కోరారు. నాయకులు మంగళవారం మాట్లాడుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదం లో నష్టపోయిన రైతాంగానికి నేటి వరకు న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు రూ.12 వేలు చెల్లించాలన్నారు. ప్రమాదం జరిగి 38 రోజులవుతుందన్నారు. కాలాతీతం అవడం వల్ల కోల్డ్‌స్టోరేజి యజమాని రైతాంగాన్ని మోసం చేయడానికి ఆస్కారం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారని చెప్పారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

## తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు తీర్మానం

వేమూరు, ఫిబ్రవరి 27 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో సభ్యులు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు నిమిత్తం తీర్మానం చేశారు. వెల్లటూరు రోడ్డులోని భట్టిప్రోలు విశ్వశాంతి స్కూల్లో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌తో పాటు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తీర్మానం చేశారు. కొల్లూరు మండలంలోని రెండు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పిడి నిమిత్తంగా తహసీల్దార్ సూచన మేరకు పరిశీలన జరిపి మార్పు చేసేందుకు తీర్మానం జరిగింది. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దండే వెంకట సుబ్బారావు, వాకా ఆనందశేషుబాబు, పివి వేణుగోపాల్, వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు మోర్ల శ్రీనివాసరావు, సీపీఎం నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

## 2న హైదరాబాదులో ఆత్మీయ సమావేశం

● నియోజకవర్గానికి చెందిన వ్యక్తులను కలవనున్న ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 27 : హైదరాబాదు నగర పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వేమూరు నియోజకవర్గ ఓటర్లు, కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మార్చి 2న హైదరాబాదులో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశం జరగనుంది. నియోజకవర్గానికి సంబంధించిన కుటుంబాల సభ్యులు, ఓటర్లు ఈ ఆత్మీయ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ప్రతినిధులు కోరుతున్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 27 : మండలంలోని కావూరులో గల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు చేరేందుకు మార్చి 1 నుంచి దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ వి.స్వరూపరాణి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలో బాలికలకు 80 ఖాళీలున్నాయన్నారు. 5వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి మార్చి 31లోపు మీసేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 3, 4 ప్రభుత్వలేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షకు మించరాదన్నారు.

## టీడీపీ మండల కార్యాలయానికి కుర్చీలు వితరణ

అమృతలూరు, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయానికి దాత కుర్చీలను అందజేశారు. గోవాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ కార్యకర్త కావూరి శ్రీనివాస్ జ్ఞాపకార్థం తండ్రి కావూరి సత్యనారాయణ (బుల్లాయి) రూ.25 వేల విలువ చేసే 50 కుర్చీలను పార్టీ నాయకులు యలవర్తి బ్రహ్మానందం, శరణు శేషగిరిలకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవీంద్రబాబు, పాంచాళవరం సర్పంచ్ పావులూరి హేమచంద్, బొల్లు రామేశం, సుంకర మనోహర్, వెలువోలు సుభాష్ చంద్రబోస్, దొడ్డపనేని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి అధికారులు సహకరించాలి : సర్పంచ్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 27 : గ్రామంలోని రహదారుల అభివృద్ధికి ఉన్నత శాఖా అధికారులు సహాయ సహకారాలు అందిస్తే పంచాయతీలోని రహదారులను అభివృద్ధి చేసుకుంటామని గ్రామ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి అన్నారు. బలుసులపాలెం సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామస్తులు కలసి గ్రామంలోని రహదారులు పల్లపు ప్రాంతంలో ఉన్నాయని, ఓల్డ్ కోర్స్ డ్రెయిన్‌లో మేర ప్రాంతం మట్టిని తోలుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాసమూర్తికి, తహసీల్దార్‌లకు మంగళవారం వినతి పత్రాలు అందించారు. ఇరిగేషన్ అధికారుల అనుమతి ఇప్పించాలని వార్డు సభ్యులు, గ్రామస్తులు కోరారు.

## జేబీబీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దోవ రమేష్‌రాంజీ

రేపల్లె, ఫిబ్రవరి 27 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జై భీమ్ భారత్ పార్టీ రేపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా న్యాయవాది దోవ రమేష్‌రాంజీ పేరును పార్టీ అధినేత, హైకోర్టు ప్రముఖ న్యాయవాది జడా శ్రావణ్‌కుమార్ ప్రకటించినట్టు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌రాంజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జేబీబీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు శ్రావణ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రేపల్లె ప్రాంతంలో 20 సంవత్సరాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ పది సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలు అందిస్తున్నానన్నారు. ప్రజాసమస్యలపై బాధితుల తరుపున నిరంతరం పోరాటాలు చేస్తూ వారికి అండగా ఉన్నామన్నారు.



## ఆనందబాబును సత్కరించిన కాపు నాయకులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 27 : నియోజకవర్గంలోని కాపు నాయకులు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ఆనందబాబును మంగళవారం కలసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వేమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నక్కా ఆనందబాబు పేరును ప్రకటించిన జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఆనందబాబును వేమూరు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంపై కాపు కుటుంబ సభ్యులుగా ఆనందం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. టీడీపీ గెలుపు కోసం జనసేనతో కలిసి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండె వెంకట సుబ్బారావు, యర్రంశెట్టి కర్ణ శ్రీనివాసరావు, కేలం శ్రీనివాసరావు, సింగంశెట్టి కామేశ్వరరావు, అమ్మిశెట్టి కిషోర్, ధూళిపూడి గోపాలకృష్ణమూర్తి, బాలకృష్ణ, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ఆనందబాబును సత్కరిస్తున్న నియోజకవర్గ కాపు నాయకులు

## వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలి

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి, బెల్లంకొండవారిపాలెం, చింతరేవుపాలెం గ్రామాల్లో మంగళవారం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. అధికార పార్టీ నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, ఎన్నికలు 50 రోజులు మాత్రమే ఉండటంతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఈ విషయాన్ని గమనించి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఒగిబోయిన వెంకట్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, కేసన రవీంద్ర, శొంఠి శ్రీను, పీవీ చింతారావు, నల్లపాటి యల్లయ్య, టీడీపీ నాయకులు కూచిపూడి మోహన్‌రావు, బొర్రా సురేంద్ర పాల్గొన్నారు.


కార్యక్రమంలో భాగంగా మహిళలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

## యువతకు ఉద్యోగాలు రావాలంటే టీడీపీ రావాలి : ఉప్పాల

చెరుకుపల్లి, ఫిబ్రవరి 27 : యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన రావాలంటే ప్రజలు టీడీపీ వెంట నడవాలని టీడీపీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు అన్నారు. గుళ్ళపల్లిలో మంగళవారం బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో అందించే పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ టీడీపీకి ఓటు వేయాలన్నారు. వైసీపీ పాలనలో యువత ఎలాంటి ఉద్యోగాలను పొందలేదన్నారు. టీడీపీ, జనసేనల ప్రభుత్వం రాబోతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొహమాటం రాధాకృష్ణమూర్తి, ఉయ్యూరు శివకృష్ణ, బట్టు సుధాకర్, కాటూరి నాగేశ్వరరావు, వంగరు చక్రవర్తి, సీతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మోర్ల సీతారామయ్య, జనసేన నాయకులు మొహమాటం పృథ్వీ, దాసరి లక్ష్మీ, పవన్, పోతంశెట్టి వెంకట్, సోమయ్య పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి : ఆర్డీవో

రేపల్లె, ఫిబ్రవరి 27 : రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రతి ఒక్క అధికారి విధులు నిర్వహించాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రేపల్లె నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్స్, పోలీస్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పక్కా బందోబస్తు నిర్వహించేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికలను ముందస్తుగానే రూపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్స్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


వివిధ శాఖల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్

## మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సహకరించాలి

రేపల్లె, ఫిబ్రవరి 27 : రానున్న మహాశివరాత్రికి అన్ని శాఖల అధికారుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం వాహనాలకు అవసరమైన చోట పార్కింగ్ చలువ పందిళ్ళు, తాగునీరు, రాకపోకలకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది అత్యవసర పరిస్థితులకుగాను మెడికల్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో రాజేశ్వరరావు, సర్పంచ్ లోయ బాబూ నాంచారయ్య, ట్రస్టుబోర్డు సభ్యులు భూపతి కొండలు, పోలీసు, ఫైర్, మెడికల్ వైద్యశాఖ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## 16న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె, ఫిబ్రవరి 27 : సర్కిల్ పరిధిలోని వివిధ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మార్చి 16వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించటం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కోర్టులో పోలీస్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్చటం జరుగుతుందని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ జాతీయ లోక్‌అదాలత్ సద్వినియోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరికుమార్, వివిధ పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# పంటలపై దుమ్ము..ధూళి..!



మొక్కజొన్నను మింగేసిన దుమ్ము

- ఎదుగుదల లేక..ఎండిపోతున్న పైర్లు
- బల్లికురవ-మార్టూరు అర్‌అండ్ రోడ్డులో కాలుష్య ముప్పు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా రోడ్డు
- లక్షలు పెట్టుబడిపెట్టినా పండడంలేదని రైతుల ఆందోళన





దుమ్ము ఎగిసి పడుతుండడంతో ఎదుగదలలేని మిర్చి.. పొగాకుపై పేరుకుపోయిన ధూళి



గ్రానైట్ లారీల తాకిడికి లేస్తున్న దుమ్ము

బల్లికురవ. ఫిబ్రవరి 27 : రోడ్ల నుంచి వస్తున్న విపరీతమైన దుమ్ము ధూళి ప్రభావం వాహనచోదకులతో పాటు పంటలపై పెను ప్రభావం చూపుతోంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు రోడ్ల వెంట ఉన్న పొలాల్లో పండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల తాకిడితో ఎగిసిపడుతున్న దుమ్ముతో పంటలు ఎదుగదల లేకుండా పోతున్నాయని రైతులు చెప్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను మరమ్మతులు చేసిన పాపానపోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రోడ్ల మర్మతులు చేపడితే తాము పంటలు సాగు చేసుకునే వీలు ఉండేదని ఇప్పుడు పంటలు సాగు చేయాలంటేనే భయమేస్తుందని కొందరు రైతులు వాపోతున్నారు.

బల్లికురవ - మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులో నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై మట్టిరోడ్డులా మారింది. ఈ రోడ్డులో ముందు వాహనం వెళితే వెనుక వచ్చేవారు దుమ్ములో కనిపించని పరిస్థితి ఉంది. దీనినిచూస్తే ఇక్కడ ఏ స్థాయిలో దుమ్ము లేస్తోందో అర్థమవుతోంది. ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పాలకులు చెప్తున్నా ఎక్కడా తట్టెడు మట్టిని పోయలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, రాత్రి గ్రానైట్ లారీలు వెళ్తుండడంతో దుమ్ములేచి కష్టపడి, పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్నా పంటలు పండడం లేదని వారు కంటతడి పెడుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్డు కిరువైపులా నక్కబొక్కలపాడు, మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతు లు మొక్కజొన్న, మిర్చి, కంది, పొగాకు, కూరగాయాల పంటలను బోరు బావులు, వర్షాధారంగా పంటలు సాగు చేశారు. రోడ్డు నుంచి వస్తున్న దుమ్ముతో ఎదుగుదల లేకుండానే ఎండిపోతున్నాయి. రైతులు పలు మార్లు తాము పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలపై తెల్లటి దుమ్ము పేరుకు పోయిందని మిర్చి పంట అయితే పెరగకుండానే ఎండిపోతుందని కాలుష్య ప్రభావం ఇలా ఉంటే కనీసం నీటిని కూడా రోడ్డుకు చెల్లించడంలేదని రైతులు అరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రోడ్డు ఇలానే ఉంటే ఇరువైపులా ఉన్న పొలాలు బీడులుగా మారే ప్రమాదం పొంచి ఉందని రైతులు తెలిపారు. గ్రానైట్ లారీలు వెళ్లిన సమయంలో లేస్తున్న దుమ్ముతో పంట పొలాల్లో ఉన్న రైతులు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారని, కూలీలు పనులకు కూడా రావడం లేదని రైతులు తెలిపారు. పంట దిగుబడులు అరకొరగా వచ్చిన దుమ్ము ఉండడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. సుమారు వంద ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేశామని దుమ్ము ప్రభావం ఈ పంటలపై ఉందని రైతులు తెలిపారు. గత నెలలో పెద్ద పెద్ద గోతులు రోడ్డులో ఉండడంతో నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య గోతులు చదరం చేయించారని ఇప్పుడు గ్రానైట్ వాహనాలు వేగంగా పోతున్నాయని దీంతో మరింత దుమ్ము పెరిగిందని రైతులు తెలిపారు. ఇదే రోడ్డులో ఉన్న నక్కబొక్కలపాడుతోపాటు ఎస్సీ కాలనీకి కూడా దుమ్ము ప్రభావం అధికంగా ఉందని ప్రజలు డస్ట్ అలర్జీలబారిన పడుతున్నారని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే బల్లికురవ - మార్టురు అర్ అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

### ఏ పంట వేసినా దుమ్ముతో నష్టపోతున్నాం



నాకు బల్లికురవ-మార్టూరు అర్ అండ్‌బీ రోడ్డు పక్కనే పొ లం ఉంది. రోడ్డు మర్మతులు లేకపోవడంతో వాహనాలు వెళ్లివచ్చేసమయంలో పెద్ద ఎత్తున దుమ్ము..ధూళి లేచి పొలాలమీదికి వస్తోంది. దీంతో ఏ పంట సాగు చేసినా పండడం లేదు. తీవ్రంగా నష్టాలు వస్తున్నాయి. అయిదేళ్ల కాలంలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టిని కూడా వేసిన పాపాన పోలేదు. వైసీపీ పాలకులు రోడ్లను పట్టించుకోవడం లేదు. రోడ్డు ప్రక్కన సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డును అభివృద్ధి చేయాలి.

- ధూళిపాళ్ల పూర్ణయ్య, రైతు, నక్కబొక్కలపాడు



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వీరయ్య

## బీసీ, టీఎన్‌టీయూసీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 27 : చినగంజాం గ్రామంలో మార్చి 5న బాపట్ల పార్లమెంట్ స్థాయిలో జరిగే టీడీపీ బీసీ, టీఎన్‌టీయూసీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీర య్య పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మండల బీసీ సం ఘం అధ్యక్షుడు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షతన మంగళవారం జరిగిన బీసీ, టీఎన్‌టీయూసీ నాయకులు, కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలోఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా బీసీ యాదవ సాధికార సమితి కన్వీనర్ నక్కల వీరరాఘవులు, పర్చూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నరహరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు కొండ్రగుంట శ్రీహరి, వీ .వెంకయ్య, ఎన్‌వీ నారాయణ, యార్లగడ్డ లక్ష్మి, అబ్దుల్ కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, దండుప్రోలు తిరుపతిరావు, కే.రామాంజనేయులు, కే.విష్ణు, పిచ్చయ్య, బాలరాజు, షేక్ జిలాని, షేక్ ఖాదర్‌బాషా, కే.రాముడు, పైనం సుబ్బారావు, పిల్లి కృష్ణ, రాజు వెంకటేశ్వరరెడ్డి, టి.చిన్నా, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, జి.నరసింహారావు, గోపాలం, పట్టాభి వెంకటేశ్వర్లు, టీఎన్‌టీయూసీ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాలరాజుపై చర్యలు చేపట్టాలి




ఆందోళన చేపట్టిన వేటపాలెం పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 27 : వేటపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి-2 డాక్టర్ బాలరాజు తమను వేధిస్తున్నారని, ఆయనపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీ పరిధిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఆందోళనకు దిగారు. డాక్టర్ తమను చేతల ద్వారా, మాటల ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. డాక్టర్ బాలరాజుపై గతంలో చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో చేపట్టిన విచారణలో తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ మేరకు కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు వీరికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్డుదారులతో మర్యాదగా మాట్లాడాలి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 27 : రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులతో మర్యాదగా మాట్లాడాలి. కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌వో విలియమ్స్ డీలర్లు స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని డీలర్లతో సమీక్ష నిర్వహించారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సంబంధించి స్పందనలో వచ్చే అర్జీలపై చర్యలు తప్పవన్నారు. అవకతవకలకు పాల్పడితే కేవలం 6ఏ కేసులతో సరిపుచ్చమని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోయినా, నల్లబజారుకు తరలించినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## కనకనాగవరపమ్మను దర్శించుకున్న నరేంద్రవర్మ

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 27 : కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ టీ డీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకు లు, కార్యకర్తలు ఉన్నారు.

## ముగిసిన డ్రైవర్ల అంత్యక్రియలు

### శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

బల్లికురవ. ఫిబ్రవరి 27 : కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నక్కబొక్కలపాడుకు చెందిన లారీ డ్రైవర్లు దాసరి ప్రసాద్, దాసరి కిషోర్, బండి నాగయ్య మృతదేహాలు పోస్టుమార్టం అనంతరం మంగళవారం గ్రామానికి చేరాయి. దాసరి ప్రసాద్, దాసరి కిషోర్ మృతదేహాలను రామాంజనేయపురం గ్రామంలోని వారి స్వస్థలా లకు తరలించి అక్కడ వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. బండి నాగయ్య మృతదేహాన్ని నక్కబొక్కలపాడుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బతుకు దెరువుకు లారీ డ్రైవర్లగా వెళ్లి విగత జీవులుగా వచ్చారని బాధిత బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. వీరి మృతదేహాలను చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామాజంనేయపురం, నక్కబొక్కలపాడు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. లారీ టైరు మారుస్తుండగా వారిని బస్సు ఢీకొట్టటం, అందరూ మృతి చెందడం విధి తలరాత అంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. లారీ డ్రైవర్ల మృతి వార్త తెలిసి పలు వాహనాల డ్రైవర్లు మంగళవారం లారీలకు వెళ్లకుండా సెలవు ప్రకటించారు.

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పర్చూరు, ఫిబ్రవరి 27: పర్చూరు నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిలక అధికారి కే వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో ఆధ్యక్షతన గుర్తింపు పొందిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ 22-01-2024 ఫైనల్ పబ్లికేషన్ తదుపరి వచ్చిన క్లైమ్‌లను ఎన్నిలక కమీషన్ నిబంధన ప్రకారం మాత్రమే పూర్తిచేయం జరుగుతుందని తెలపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా సిబ్బంది కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం తహసీల్దార్‌లు సీహెచ్.సుబ్బయ్య, ఎం.ప్రమీల, జీవీఎస్ ఫణీంద్రబాబు, రాజకీ య పార్టీల నేతలు శివనాగేశ్వరరావు, షేక్ షంషుద్దీన్, నన్నపనేని రంగయ్య చౌదరి, లంకా శివనాగేశ్వరరావు, అడపాల కృష్ణ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

బల్లికురవ. ఫిబ్రవరి 27 : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ సుభద్ర పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులను పరిశీలించి నివేదికలు తయారు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియెగించుకోనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. వృద్ధులకు ర్యాంపులు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయనవెంట సర్వేయర్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి రవుఫ్‌ఖాన్ ఉన్నారు.

### గ్రామాలపై నిఘా

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్ఐ నాగశివారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పెరపాలెం, వేమవరం, కోటవారిపాలెం గ్రామాలలో ఎస్ఐ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంటుందన్నారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసకుంటాని హెచ్చరించారు.

## చెన్నుడిని తాకిన ఆదిత్య కిరణాలు

### అద్భుత దృశ్యాన్ని చూసి తరించిన భక్తులు



స్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

పంగులూరు, ఫిబ్రవరి 27 : మండలంలోని చందలూరు గ్రామంలోని శ్రీ భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకాయి. ఈ అద్భుత ఘట్టం మంగళవారం ఉదయం ఆవిష్కృతమైంది. ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి 6 గంటల 50 నిముషాల వరకు సూర్యకిరణాలు స్వామి వారిని స్పృశించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని పలువురు భక్తులు చూసి తరించారు. ప్రతి ఏటా సౌరమానాన్ని అనుసరించి ఉత్తరాయణం, కుంభ సంక్రమణం, శతభిషం కార్తెలో ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిమిషాల వరకు, దక్షిణాయణం కన్యా సంక్రమణం, చిత్తకార్తెలో అక్టోబరు 14, 15 తేదీలలో ఉదయం 6 గంటల 5 నిముషాల నుంచి 6 గంటల 25 నిమిషాల వరకు సూర్యకిరణాలు ఆలయ మూలవిరాట్ ఆవిష్కరించడం జరుగుతుందని అర్చకస్వామి పర్చూరు రఘునాథాచార్యులు తెలిపారు.

# క్రీడా సంఘాలకూ వైసీపీ పీడ..!

### ఎమ్మెల్యే గొట్టిపాటి



అద్దంకి, ఫిబ్రవరి 27 : చివరకు క్రీడాకారులకు, క్రీడా సంఘాలకు కూడా వైసీపీ రాజకీయ పీడ పట్టిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రకటనలో ఆం దోళన వ్యక్తం చేశారు. భారతదేశం తరఫున పలు టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన అంతర్జాతీయ క్రికెటర్ హనుమ విహారీ తిరుపతిలోని వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్ దెబ్బకు రంజీ జట్టు కెప్టెన్సీని కోల్పోయారన్నారు. తీవ్ర అవమాన భారంతో ఏకంగా విహారీ జట్టు వదిలివెళ్లి పోయేలా వైసీపీ వారు మనోవేదనకు గురిచేశా రని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రా జకీయ ఒత్తిడికి గురై రాష్ట్రానికి ప్రతిష్ట తెచ్చే విహారీ పట్ల అనుసరించిన విధానం సరైనది కాదని క్రికెట్ అభిమానులందరూ వ్యాఖ్యానిస్తున్నారన్నారని గొట్టిపాటి తెలియజేశారు. జగన్‌రెడ్డి పాలన క్రీడా వ్యవస్థను సైతం నీరుగారుస్తోందన్నారు. రాను న్న ఎన్నికలలో లబ్ధి పొందేందుకు ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రచార ఆర్భాటం చేశారన్నారు. జగన్‌రెడ్డి క్రీడాకారుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని, ఆంధ్రా ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారు. మేటి క్రీడాకారులను పొ రుగు రాష్ట్రాలకు, పెట్టుబడులు పొరుగు రా ష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విహారీని పొ రుగు రాష్ట్రానికి పారిపోయేలా అనుచిత చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. హనుమ విహారీపై ఇష్టారీతిన మాట్లాడిన వైసీపీ నాయకులు తక్షణమే క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని ఇవ్వాలని గొట్టిపాటి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### టీపీడబ్ల్యూ నూతన కమిటీ



జితేంద్ర పవన్

పర్చూరు, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం పార్టీకి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వెన్నుదన్నుగా నిలవాలని బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పర్చూరు నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ నూతన కమిటీని ఆయన ప్రకటించారు. ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సాంకేతిక పరంగా పార్టీకి అండదండలు ఉండాని కోరారు. పర్చూరు నియోజకవర్గ అధ్యక్షునిగా వెంపరాల జితేంద్ర పవన్ చింపపల్లిపాడు, ప్రధాన కార్యదర్శులుగా యాగంటి రాఘవ (దర్శి), వంకాలయపాటి వెంకటసుబ్బయ్య (స్వర్ణ), చింతలిప్పుల సుమంత్ (బొబ్బేపల్లి), బాచిన తిరుపతయ్య(నక్కలపాలెం), ఇరుపునేని రాము (పూనూరు), కొల్లా వెంకట్ నాగ అశీత్ (నాగులపాలెం), పొద శ్రీరామ చంద్రమూర్తి (గొనసపూడి), ఆదిపూడి రవికుమార్ (ఎర్రం వారిపాలెం).

## టీడీపీ మండల ఉపాధ్యక్షునిగా రామకృష్ణ



మార్టూరు, ఫిబ్రవరి 27: టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా మార్టూరు గ్రామానికి చెందిన దురిశాల రామకృష్ణను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు నియామకపత్రాన్ని మంగళవారం రామకృష్ణకు అందజేశారు. పార్టీకి రామకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి పదవిని కట్టబెట్టారని నాగేశ్వరరావు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన ఏలూరికి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ఇంకొల్లు, ఫిబ్రవరి 27 : విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివితే ఉన్న శిఖరాలను అధిరోహిస్తారని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ జయలక్ష్మి అన్నారు. ఆదర్శ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మాస్టర్స్ ఐఐటీ పరీక్షను నిర్వహించారు. దీనిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. పోటీతత్వంతో ముందుకు సాగాలని, బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తో టకూర విజయభాస్కర్, బ్యాంక్ ఉద్యోగి విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రవాణా సమస్య తలెత్తకుండా చర్యలు

### సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ జిందాల్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

మేదరమెట్ల , ఫిబ్రవరి 27 : సిద్ధం సభకు వచ్చే ప్రజలకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు వద్ద ముఖ్యమంత్రి నిర్వహించే సిద్ధం సభ ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులతో క లి సి పరిశీలించారు. జిందాల్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుం డా జాతీయ రహదారికి ఇరువైపులా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణం వద్ద హెలిప్యాడ్‌ను తలసిల రఘురాంతో కలిసి ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ మహేష్, చీ రాల డీఎస్పీ ఎస్.ప్రసాద్‌రావు, రే పల్లె డీఎస్పీ టీ మురళీకృష్ణ, బా పట్ల డీఎస్పీ మురళీకృష్ణ, క్రైం డీ ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ, ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావు, అద్దంకి రూరల్, టౌన్ సీ ఐలు ఏ. శివరామకృష్ణరెడ్డి, కృష్ణ య్య, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా సిద్ధం సభ వాయిదా పడినట్లు తెలిసింది. మార్చి 3కు బదులు 10న జరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక వైసీపీ నాయకులకు సమాచారం అందినట్లు తెలిపారు.



# అహంకార వైసీపీని సాగనంపుదాం

- టీడీపీ జనసేన ఉమ్మడి సభను విజయంవంతం చేయండి
- పోస్టర్ ఆవిష్కరణలో నేతల పిలుపు



చలో తాడేపల్లిగూడెం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

పర్చూరు, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, శ్రేణులు కలిసి పని చేసి అహంకార, నిరంకుశ వైసీపీని సాగనంపాలని ఉభయ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. నేడు చలో తాడేపల్లిగూడెం బహిరంగ సభకు సంబంధించి మంగళవారం జనసేన ఆధ్వర్యంలో పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలసి పనిచేసిన ఆంధ్రప్రదేశ్‌లో సురక్షిత ప్రజాస్వామ్యం కోసం పోరాడి రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దింపాలన్నారు. ఇరు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఐక్యను చాటిచెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చేందుకు జగన్‌రెడ్డి పార్టీ మధ్య చిచ్చులేపే కుట్రలను అందరూ తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కారంపూడి సందీప్‌తేజ, కరారి సురేంద్ర, తులసి సునీల్ కుమార్ (చంటి), జట్టి హరి, తోట మణి, శీలం కుమార్, అచ్చుకోలు సతీష్, కందా సురేంద్ర, పసుపులేటి రవి, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కోడూరి శేషబ్రహ్మాచారి, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, కొల్లా శివరాంప్రసాద్, దాసరి రాము, శ్రీరాం వెంకటసుబ్బారావు, మామిడిపాక హరిప్రసాద్, తంగెళ్ల మల్లికార్జునరావు, చింపయ్య, కోట వెంకటేశ్వర్లు, నూతలపాటి హిజ్బాయిల్, షేక్‌బాషి పాల్గొన్నారు.

## కమిషనర్‌గా సత్యనారాయణ

అద్దంకి, ఫిబ్రవరి 27 : అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణ ను నియమించారు. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా ఫిబ్రవరి 1వ తేదీన బాధ్యతలు తీసుకున్న అబ్దుల్ రషీద్ నెల రోజులు తిరగకుం డానే బదిలీ అయ్యారు. కాకినాడ అర్బన్ డెవలెప్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న సత్యనారాయణను అద్దంకి కమిషనర్‌గా నియ మించారు.

## మున్సిపల్ కమిషనర్ బదిలీ

చీరాల, ఫిబ్రవరి 27 : ఇటీవల చీరాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయసారథి మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన చీరాల నుంచి పాలకొల్లు మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడకు పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీ సింహాచలంను బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న పార్థసారథిని, అటెండర్ నుంచి అంచలంచెలుగా ఎదిగి బిల్ కలెక్టర్‌గా ఈనెల 29న రిటైర్డ్ అవుతున్న టి.చెన్నయ్యను కార్యాలయ, అవుట్‌డోర్ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు వారికి అభినందనలు తెలిపారు.

# కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- ఇంటికి అరకిలోమీటర్ లోపే డ్యూటీ చేస్తున్నవైనం
- రూ.2లక్షల సొత్తు మాయం



ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్ఐ సైదా

మార్టూరు, ఫిబ్రవరి 27 : రాత్రి డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ ఇంట్లో దొంగలు లూటీ చేశారు. దాదాపుగా రెండున్నర లక్షలకు పైగా విలువైన 4 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు వెండి వస్తువులు, రూ.9వేల నగదును దొంగలు ఎత్తుకు పోయారు. మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవర్‌కు తూర్పువైపున సర్వీసు రోడ్డుపక్క ఉన్న కాలనీలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. చోరీ జరిగిన ఇంటికి అరకిలోమీటర్ సమీపంలోనే కానిస్టేబుల్ హైవే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. ఎం.యోహోన్ నాయక్ హైవే పెట్రోలింగ్ మొబైల్ వాహనంలో పని చేస్తుంటారు. జాతీయ రహదారిపై మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి ఇసుక దర్శి ఫ్లైవోవర్ మీదుగా రాజుపాలెం కూడలి వరకు కానిస్టేబుల్ యోహోన్ కారులో పెట్రోలింగ్ చేస్తుంటారు. సోమవారం రాత్రి యధావిధిగా పెట్రోలింగ్ కారులో డ్యూటీకి వెళ్లారు. అతని భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎ వరూ లేక పోవడంతో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వెళ్లి ఇంటి తాళాలను గమనించి వచ్చారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో మరలా కానిస్టేబుల్ ఇంటికి వెళ్లగా తాళాలు తీసి ఉండడంతో ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో ఉండాల్సిన బంగారు వస్తువులు బ్రాస్‌లెట్, ఉంగరం, జుంకాలు, వెండి పట్టాలు, వెండి చైన్‌తో పాటు రూ.9వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు మార్టూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సైదా, కానిస్టేబుల్ ప్రసాద్ వచ్చి పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఇదిలావుండగా రోజూ ఇంటికి సుమారు 500 మీటర్ల దూరంలో ఒంగోలు వైపు పెట్రోలింగ్ చేస్తూ రోజూ అక్కడే రోడ్డు పక్కనే పోలీసులు కారును పార్కింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో చోరీ జరగడం అటు పోలీసులను, కాలనీవాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. నెలకిందట దొంగతనం జరిగిన ఇంటి నుంచి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న భారత్ గ్యాస్ కార్యాలయంలో అర్ధరాత్రి దొంగతనం చేయడం సీసీ ఫుటేజీలో ఉంది. మళ్లీ ఇదే రోడ్డులో కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిసమయంలో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.